ఆగష్టు - 2025

# హన్నాకృప

ఆధ్యాత్మిక మాస పత్రిక

## విషయసూచిక


| | | |
|---|---|---|
| సంపాదకీయం | కె.ఇ. రాజేంద్ర | 02 |
| జప్పత్వనేహు | కొడవటికంటి | 03 |
| నా చిత్తానుసారుడు | కొడవటికంటి | 05 |
| మహానటులు | కె.ఇ. రాజేంద్ర | 07 |
| మధ్యకాలము | హన్నాకృప డెస్క్ | 08 |
| నీ సృష్టికర్త | హన్నాకృప డెస్క్ | 09 |
| పాల్‌గోవిందరెడ్డి | సాక్ష్యము | 10 |
| కొడవటికంటి ప్రస్థానం | | 12 |
| ఆందోళన | డా॥ హారిక ప్రజ్వలిత్ | 14 |
| మదర్‌తెరీసా | వై. ప్రసాద్‌రావు | 15 |
| తల్లిదండ్రులారా | హన్నాకృప డెస్క్ | 17 |
| భక్తిహీనులు ఎవరు? | డా॥ సుష్మ, నెల్లూరు | 19 |
| నా కుటుంబము | స్త్రీల కొరకు | 20 |
| అవిశ్వాసము | చిన్నపిల్లల పేజి | 22 |
| బైబిల్ పదవినోదం-08 | | 24 |



**సంపాదకులు :**

**కె. ఇమ్మానియేల్ రాజేంద్ర**
B.A.,B.L.,



**చందా వివరాలు :**

**సంవత్సర చందా రూ. 350/-**
పోషక చందా రూ. 1500/-
జీవితచందా రూ. 5000/-




**చిరునామా :**

ఎడిటర్, హన్నాకృప
పోస్ట్‌బాక్స్ నెం.51 , క్లాపేట, 6వలైను
ఒంగోలు-523001, ప్రకాశంజిల్లా
సెల్ : 9440217726



**బ్యాంకు అకౌంటు వివరాలు :**

A/c Name: **K. Emmanial Rajendra**
A/c No.: **10957294340**
Bank: SBI Main Branch, Ongole
IFSC Code : SBIN0000890


| సీరియల్ నంబరు | |
|---|---|

# సంపాదకీయం.... దేవుని వాక్యము బ్రతికిస్తుంది

హన్నాకృప పాఠకులకు ప్రభువు నామమున వందనములు.

దేవుడు ఈ భూమ్మీద మనుష్యులను సృష్టించినప్పుడు తినడానికి ఆహారముగా పండ్లు తప్ప వారికి ఇంకేమి ఇవ్వలేదు. ఇప్పుడైతే మనం కొంతకాలం ఏమీ తినకపోతే చనిపోతాము. కాని అప్పుడు చావు లేదు. అయినప్పటికీ తినడానికి దేవుడు వాళ్ళకి ఎన్నో రకాల రుచికరమైన పండ్లు ఇచ్చాడు. దేవుడు మంచిచెడ్డల తెలివినిచ్చే చెట్టు వేయడానికి ముందే ఎన్నో రకాల పండ్లు ఇవ్వడానికి కారణం వాళ్ళని పరీక్షించడానికే తప్ప చావులేని వాళ్ళు తిని బ్రతకటానికి కాదు. *"ఆహారము వలననే గాక యెహోవా సెలవిచ్చిన ప్రతి మాట వలన నరులు బ్రదుకుదురని నీకు తెలియజేయుటకు ఆయన నిన్ను అణచి నీకు ఆకలి కలుగజేసి..."* అని ద్వితీయో.8:3లో వ్రాయబడింది. మనుష్యులు కేవలము ఆహారం వలన మాత్రమే బ్రతకరని దేవుడు చెప్తున్నాడు. ఏదెను తోటలో దేవుడు ఆదాము హవ్వలతో *"నీవు వాటిని తిను దినమున నిశ్చయముగా చచ్చెదవని నరుని కాజ్ఞాపించెను" (ఆది.2:17).* మరణమనేది తినటం, తినకపోవడానికి సంబంధించింది కాక, దేవుని ఆజ్ఞకు సంబంధించినదై ఉంది. ఆజ్ఞ అతిక్రమమే పాపము. పాపము వలన వచ్చు జీతము మరణము. కాబట్టి ఆది దంపతులైన ఆదాము, హవ్వలు దేవుని ఆజ్ఞను మీరి, దేవుడు తినవద్దని చెప్పిన పండ్లు తిని చావును కొని తెచ్చుకున్నారు. కేవలం ఆహారం మాత్రమే మనిషిని బ్రతికించదు. అయితే చాలామంది ఆకలితో సంబంధం లేకుండా తినడానికే పుట్టినట్లు ఎప్పుడూ తింటూనే ఉంటారు. ఇలాంటి వారినే తిండిబోతులు అంటారు.  వాళ్ళది కడుపా, చెరువా అన్నట్లు పీకలదాకా మెక్కేస్తూ ఉంటారు. ఫిలిప్పీ.3:19లో చెప్పిన విధంగా 'వారి కడుపే వారి దేవుడు' అన్నట్లు తిండి మీదనే వారి ధ్యాసంతా ఉంటుంది. ఇలాంటి వారు తిన్నా చస్తారు, తినకపోయినా చస్తారు. మోషే నలుబది రాత్రింబగళ్ళు సీనాయి కొండ మీద యెహోవా సన్నిధిలో ఉన్నప్పుడు ఆకలిదప్పులు లేకుండా జీవించగలిగాడు. యేసుప్రభువు చెప్పే వాక్యము వినడానికి వచ్చిన జనసమూహము పిల్లలు, పెద్దలు, స్త్రీలు, వృద్ధులు మూడు నాలుగు రోజులు ఆకలి ఎరుగకుండా ఆయన వాక్యము విన్నారు. కోటి విద్యలు కూటి కొరకే అని చెప్పి కడుపు నింపుకోవడానికి నానా కష్టాలు పడటం అన్నది దేవుడిని నమ్మకపోవడాన్నిబట్టి మనుష్యులు ఏర్పరచుకొన్నది. ఆకాశ పక్షులను చూడుడి. అవి విత్తవు, కోయవు, కొట్లలో కూర్చుకొనవు. అయినను మీ పరలోకపు తండ్రి వాటిని పోషించుచున్నాడు అని యేసు చెప్పిన మాటలు అర్థంకాకనో, అర్థం అయినా దేవున్ని నమ్మకపోవటం వల్లనో మనుష్యులు ఆహారం సంపాదించుకోడానికి అష్టకష్టాలు పడుతున్నారు. దేవున్ని నమ్మిన వారికి ఆయన సమృద్ధిగా ఆహారము దయచేస్తాడు. *"ఆయన ఆహారమును సమృద్ధిగా ఇచ్చువాడు" (యోబు 36:31), "ఆకలిగొనిన వారికి ఆహారము దయచేయును" (కీర్తనలు 146:7).* దేవుని సన్నిధిలో మనం ఉంటే మనకు ఆకలి అనిపించదు, ఒకవేళ ఆకలిగొంటే దేవుడే ఆహారము దయచేస్తాడు. కాబట్టి దేవుని సన్నిధి, ఆయన వాక్యము మనుష్యులను ఆత్మీయంగానే కాకుండా శారీరకంగా కూడా బ్రతికిస్తుంది.

**- కొడవటికంటి ఇమ్మానియేల్ రాజేంద్ర, ఎడిటర్**

**K. Emmanial Rajendra, SBI Main Branch, Ongole**
**A/c No. 1095729434O**

సీరియల్

# జప్నత్పనేహు

38

(యోసేపు జీవిత చరిత్ర)

– కొడవటికంటి

వియాన్ వెళ్లిపోతుంటే జప్నత్పనేహు వచ్చి తన గదిలో కూర్చున్నాడు. అక్షాపు వచ్చాడు. జప్నత్పనేహు ఆసనం చూపించాడు. అక్షాపు ఏదో అడగాలని ఉన్నట్లు అర్థం అవుతుంది. కాని ఎందుకో సందేహిస్తున్నాడు. జప్నత్పనేహు తీరుబడిగా ఉన్నట్లు కనబడుతూ, "చెప్పు..." అన్నాడు. "మీరు ఇప్పుడు అన్యుల కన్యను వివాహం చేసుకోబో తున్నారు కదా! మీరు కొంచెం వివరణ ఇవ్వండి" అన్నాడు అక్షాపు.

"దేవుని దృష్టిలో అన్యులని, సొంతవారని లేరు. ఈ లోకంలో ప్రతి మానవుడు దేవుని బిడ్డ. ఆయనను పూజిం చినా, పూజింపక పోయినా, విగ్రహారాధికులైనా, కాక పోయినా, నీతిమంతుడైనా, అనీతిమంతుడైనా ఆయన బిడ్డే. తను పుట్టిన కుటుంబమునుబట్టి, దేశాన్నిబట్టి ఏదో ఒక రూపాన్ని కానీ, నామాన్ని కాని పూజించి ధ్యానిస్తుంటారు. దేవుని ప్రార్థించేవారు, ఆయన ఉన్నాడని, చూస్తున్నాడని, వింటున్నాడని నమ్మాలి. అంతేకాని ఆచారంగా అలవాటుగా చేసే ప్రార్థనలు ఏవి అంగీకరించబడవు. ఈ లోక సంబంధ మైనవి ఏవీ ఎవ్వరూ దేవున్ని అడగకూడదు. నేను చిన్న తనంలో దేవున్ని అన్నీ అడిగేవాడిని. మా అన్నదమ్ములందరి కంటే, మా నాన్న నన్ను ఎక్కువగా ప్రేమించేవాడు. అయినా నాకు ఏదో కావాలి. అందరికంటే మంచివాడననిపించు కోవాలి. అందమైన వస్త్రాలు నాకున్నాయి. ఇంకా నాకు కావాలి అనే కోరిక ఉండేది. అవన్నీ దేవుడు ఇస్తాడు అని నాకు ఎవరు చెప్పలేదు. మనం మనుష్యులను అడగాలి. లేకపోతే, మనమే సంపాదించుకోవాలి అని అనుకునేవాడ్ని.

ప్రపంచంలో దేవుని యధార్థంగా ప్రేమించి, హృదయ పూర్వకంగా విశ్వసించని వారు అందరు నావలెనే ఆలోచి స్తారని నేననుకోలేదు. అందరిలోను, ఇతరులను మించి పోవాలని కోరిక, పగ, ద్వేషం, కుళ్ళు ఉంటాయని నాకు తెలియదు. ఒక రోజున తండ్రిగారి నుండి నన్ను దేవుడు దూరంగా నడిపించాడు. నేను ఒంటరిగా ఎంత బలహీను డనో, బుద్ధిహీనుడనో, నాకు తెలిసేటట్లుగా చేసాడు. మరణలోయలో, త్రోయబడ్డాను. ఎవరి వలన అని అడగ వద్దు. నా స్వార్థం, నా గర్వం, నా మాటలు, నా చేతల వలన ఇతరులను బాధపెట్టినందు వలన మరణం నాకు అడుగుదూరంలో మాత్రమే ఉంది.

దేవుడే, రక్షకుని నా దగ్గరకు నడిపించాడు. చాలా దూరం నుండి, గిలాదు నుండి నడచి వచ్చింది. నేను దేవుడ్ని ప్రార్థించలేదు. రక్షణ వస్తుందని కూడా ఊహించలేదు. దయగల దేవుడు ఉచితంగానే రక్షించాడు. బానిసగా అమ్మబడ్డాను. గృహనిర్వాహకునిగా మారాను. నాలాంటి బానిసలు అందరు, అమ్మబడిన చోటే గృహ నిర్వాహకులు కాలేరని తెలుసుకున్నాను. మరణం నుండి రక్షింపబడి నప్పటికిని, గృహనిర్వాహకునిగా మార్చబడటానికి నా కృషి ఏమి లేదు. నా దేవుడు నా విషయం శ్రద్ధ తీసుకుంటు న్నాడు. నిజానికి నా జీవితం ఏ రకంగా ఉంటే, నేను సుఖశాంతులతో ఉంటానో నాకు తెలియదు. నా భవిష్యత్తు నాకు తెలియదు. కనుక నేను నా విషయం దేవుని మీద పెట్టి, ప్రక్కవానికి మేలు చేయటం కోసం నన్ను ఈ లోకంలోకి పంపించాడు అని తెలుసుకున్నాను. నా ప్రతి అడుగు దేవునికి తెలుసు అని తెలుసుకున్నాను. నా ప్రతి అడుగు దేవునికి తెలుసు అని తెలుసుకున్నప్పుడు మొట్టమొదటిసారిగా నా భవిష్యత్తు దేవుని చేతిలో భద్రపరచబడింది అని తెలుసుకున్నాను. ఆయన చూస్తున్న వాడు, కనుక పొరుగు వానికి కష్టం కలిగించే పని ఏదీ చెయ్యలేదు.

అందువల్ల చెరసాల పాలయ్యాను. అది కూడా దేవుని చిత్తమేనని నమ్మాను. ఆయన ఏదో గొప్ప యోచన లేకుండా నన్ను చెరసాలలో ఉంచడు అనుకున్నాను. భరించలేని అవమానము పొందినా సహించాను. అక్కడ కూడా దేవున్ని ఏమి అడగలేదు. కాని ఇతరులకు ఉపచారము చేయటంలో నెమ్మది పొందాను. అందువలన చెరలోనే స్వతంత్రుడనై, అధికారం లేని అధికారినయ్యాను.

ఒకసారి నా స్వంత తెలివితేటలు ప్రదర్శించి, నాలుగు నెలలు మనోవ్యాకులత పొందాను. చెరలో నుండి బయట పడటానికి పానదాయకుని సహాయం అర్థించి అవమాన పరచబడ్డాను. అయినా దేవునికి నామీద కోపం రాలేదు. ఇప్పటి ఈ నాస్థితి కూడా నా పుట్టుకలోనే ఉంది. నేను పూర్తిగా లోబడునంత వరకు అది బయలు పరచబడలేదు.

ఆసెనతు విషయంలో, ఆమె నాకు ఆరు సంవత్సరాల నుండి పరిచయం. మా ఇద్దరి మధ్య గొప్ప అగాధం అడ్డుగా ఉండగా, నేను ఆమెను పెళ్ళి చేసుకోవాలని అనుకోవటమే తప్పు, ఇద్దరు యువతీయువకుల మధ్య కోరుకునే అనుభవం తలెత్తలేదు. ఒకవేళ ఏ పురుషుడైనా ఆ విధంగా ప్రయత్నించ దలుచుకున్నా, ఆమె స్థితి అందుకు ఒప్పుకోదు. ఆమె స్వభావంలో శరీర క్రియల కంటే ఆధ్యాత్మిక స్థితి ఎక్కువ. ఇతరులకు దయ చూపించినంతగా ప్రేమించలేదు. ఇతరులను కనికరించటం తెలుసు కాని, ఇతరుల నుంచి కోరుకోవటం తెలియదు. ఐగుప్తు దేశంలో చెరసాలలో ఉన్న బానిసను, ఫరో స్థానమునకు చేర్చుటకు ఎవరికి సామర్థ్యం ఉందో ఐగుప్తు ఓను యాజకుని కుమార్తెను ఆ బానిసకిచ్చి, పెండ్లి చేయటం కూడా ఆయనకే సాధ్యం. మానవులు చేయలేని పనులను దేవుడే చెయ్యగలడు. కనుక ఈ వివాహం కూడా దైవ నిర్ణయమని నమ్ముచున్నాను" అన్నాడు జప్నత్పనేహు.

వివాహము అక్షాపు, థేమాను యొక్క నిర్వహణలో చాలా ఘనంగా ముగించారు. వివాహము ముగిసిన తర్వాత మూడు రోజుల వరకు జప్నత్పనేహు వియాన్, అక్షాపు, థేమానులతో కలసి ఐగుప్తు దేశమంతటను సంచరించుటకు నమూనాలు తయారు చేస్తున్నారు. మొదట ఆరు నెలలు అక్షాపు, వియాన్ కలసి థేమాను అధ్యక్షతన దేశమంతటా పల్లెపల్లెకు, పట్టణం పట్టణంకు ధాన్యం నిల్వచేసే గిడ్డంగులు నిర్మించటానికి ఏర్పాట్లు చేశారు. దాదాపు పది సంవత్సరాల వరకు ధాన్యం చెడిపోకుండా ఉండే విధానంతో ఈ గిడ్డంగులు నిర్మించబడతాయి. ఎలుకలు పడకుండా, పురుగు పట్టకుండా, సమృద్ధి సంవత్సరాలలో వాడవలసి ఉంది. నిర్మాణశాస్త్రంలో గొప్ప అనుభవం కలిగిన థేమాను అధ్యక్షతన ప్రతి పట్టణంలో పని వారిని ఏర్పాటుచేసి, ఐగుప్తు దేశమంతటా సంచరించి వచ్చిన తర్వాత జప్నత్పనేహు బయలు వెళ్ళి నిర్మాణ కార్యక్రమాలు పరిశీలిస్తాడు.

**(సశేషం)**


**ఫోన్‌పే ద్వారా లేదా గూగుల్ పే ద్వారా పత్రిక చందా పంపించాలంటే క్రింది క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి**

Scan & Pay Using PhonePe App

Emmanial Rajendra

సీరియల్

34

# నా చిత్తానుసారుడు

(దావీదు జీవిత చరిత్ర)

– కొదవటికంటి

హెబ్రోను వచ్చినప్పటి నుండి నెతనేలు, రద్దయి ఇద్దరూ దావీదు వెంట ఇంత కాలమున్న ఆరువందల మందికి వారి కుటుంబాల వారికి తాత్కాలిక వసతి కల్పించటం, క్రొత్త ఇళ్ళు నిర్మించటంలో తలమునకలై పోయారు.

దావీదు బెనాయాను పిలిపించాడు. బెనాయా కూడా ఇప్పుడు హెబ్రోనులోనే నివాసం ఏర్పాటు చేసు కుంటున్నాడు.

"సౌలు రాజు సంగతులు తెలిశాయా?" అని అడిగాడు దావీదు.

"ఫిలిష్తీయులు గిల్బోవా పర్వతం మీద సౌలు రాజు, అతని ముగ్గురు కుమారుల శవాలు గుర్తించి సౌలు ఆయు ధాలు మాత్రం ఫిలిష్తీయుల దేశమంతటను త్రిప్పటానికి పంపించారు. అతని మొండెమును బేత్షాను కోట గోడకు తగిలించారని ఏఫెరు చెప్పాడు. అతని కుమారుల శవాలను కూడ అతని చెంతనే తగిలించారు" అని చెప్పాడు బెనాయా.

"ఆ మొండెములను ఆకాశ పక్షులు తాకలేదా?" అడిగాడు దావీదు. "ఒక్క రాత్రి కూడా పూర్తిగా తగిలించ బడలేదు. గిలాదులోని యాబేషు వారిలో యవ్వనస్తులైన శూరులు ఈ సంగతి తెలిసికొని రాత్రంతా నడచి బేత్షాను చేరి కోట గోడ మీద నుండి ఆ నాలుగు శవాలను దొంగిలిరి. ఆ శవాలను కాల్చి ఎముకలను యాబేషునకు తీసుకొని వచ్చి పిచుల వృక్షము క్రింద పాతిపెట్టారు. తర్వాత ఇప్పుడు వారు ఉపవాసమున్నారు" అన్నాడు.

"ఎప్పుడో నలభై సంవత్సరాల క్రితం రాజు విశ్వాసియై యాబేషు వారికి చేసిన మేలు నేటి యవ్వనస్తులు గుర్తుంచు కొని ప్రాణాలకు తెగించి వారు చేసిన ఈ గొప్ప కార్యం నిజంగా ఎన్నతగింది. ఏఫెరును పిలవండి" అన్నాడు దావీదు.

ఏఫెరు రాగానే "పత్రిక వ్రాయి" అన్నాడు దావీదు.

ఏఫెరు ప్రక్కన వున్న పలక తీసుకొని వ్రాయ నారంభించాడు.

"మీరు ఉపకారము చూపి మీ యేలినవాడైన సౌలును అతని కుమారులను పాతిపెట్టితిరి గనుక యెహోవా చేత ఆశీర్వచనము పొందుదురు గాక యెహోవా మీకు కృపను, సత్యస్వభావమును అగపరచును. నేనును మీరు చేసిన ఈ కార్యమునుబట్టి మీకు ప్రత్యుపకారము చేసెదను. మీ యజమానుడగు సౌలు మృతిబొందెను గాని యూదా వారు నన్ను తమ మీద రాజుగా పట్టాభిషేకం చేసియున్నారు. గనుక మీరు ధైర్యము తెచ్చుకొని బలాఢ్యులై యుండుడి" అని ముగించాడు.

"ఏఫెరు నీవే ఈ పత్రికను యాబేష్గిలాదు వారికి ఇచ్చిరా" అన్నాడు దావీదు.

ఒక నెల రోజుల వరకు హెబ్రోను చాలా హడావిడిగా వున్నది. ఎటు చూసినా క్రొత్త కట్టడాలు మంచినీటి చెరువులు ప్రతి రోజు క్రొత్త క్రొత్త వారు సైన్యంలో చేరుతున్నారు. అన్ని పట్టణాల నుండి దావీదునకు భోజన పదార్థాలు అందుతున్నాయి.

నెలరోజులు ముగిసిన తర్వాత మొట్టమొదటిగా మహనయీములో అబ్నేరు సౌలు కుమారుడైన ఇష్బోషెతును ఇశ్రాయేలీయుల మీద రాజుగా నియమించాడని తెలియవచ్చింది.

అహీతోపెలును చూసి దావీదు చాలా సంతోషించాడు. అతని పేరును చాలాసార్లు తన తండ్రి చెప్పడం విన్నాడు. అతనంత ఆలోచనాపరుడు యూదా గోత్రంలో లేడని అంటుండేవాడు. అతనిని సాదరంగా ఆహ్వానించి కూర్చో బెట్టాడు. చాలాసేపు యోగ క్షేమాలు విచారించిన తర్వాత యోనాతాను విషయం వచ్చింది.

"అతను చాలా యోగ్యుడు. అతనిలా తండ్రిని

గౌరవించినట్లుగా మరి ఎవ్వరూ కానరారు. సౌలు చేసిన పొరపాటు ఒకటి వున్నది. పెద్ద కుమారుడైన యోనాతానుకు మరియొక దేశరాజకుమార్తెనిచ్చి వివాహం చేసినట్లయితే యుద్ధములలో అతనికి చాలా సహాయకారిగా యుండేది" అన్నాడు అహీతోపెలు.

"కాని ఇశ్రాయేలీయులు మరియొక జాతి వారిని వివాహం చేసికొనరాదు గదా!" అన్నాడు దావీదు.

"మన పితరుడు అబ్రాహాము హాగరును వివాహ మాడలేదా? ఇంతెందుకు ఇప్పటి పరిస్థితులలో అహీనో యము కాని అబీగయీలు కాని ఆస్తిపరులైననూ ఏలికల వంశము కాదు. ఇప్పుడు నీవు రాజువని నిరూపించుకో వాలంటే రాజకుమార్తెను ఒకరిని వివాహమాడాలి" అన్నాడు.

దావీదు ఆలోచనలో పడ్డాడు.

"తరతరాలుగా రాజులుగా స్థిరపడిన కనానీయుల వంశములలో క్రొత్తగా రాజరికం స్థాపించిన పశువుల కాపరులకి పిల్లనిస్తారా?" అన్నాడు.

''రాజుల చరిత్రలన్ని గమనిస్తే వివాహాలన్ని రాజకీయాలే. ఇప్పుడు ఫిలిష్తీయులకు అడ్డుగా గోడకట్టా లంటే వారికి మనకు మధ్యలోనున్న గెషూరీయుల రాజ కుమార్తెను వివాహమాడాలి" అన్నాడు.

దావీదు మనస్సులో మయకా మెదిలింది. ఔను మయకా పేరుకు తగిన రూపం. సిక్లగులో యున్నప్పుడు గెషూరీయులను వెంటాడినప్పుడు ఒకసారి చూసాడు. చాలా కాలం ఆమె రూపం మదిలో ఉండినది.

దావీదు ముఖం ప్రసన్నమవటం అహీతోపెలు చూసాడు.

"నేను వివాహం విషయం చూస్తాను" అన్నాడు అహీతోపెలు. దావీదు గంభీరంగా నవ్వాడు. తాను ఇప్పుడు రాజుగా పాలస్తీనా అంతట తెలియపరచబడాలంటే రాజకుమార్తెను వివాహమాడుటయే మార్గం. వివాహ పత్రికను చుట్టూవున్న రాజులకు పంపించాలి అనుకున్నాడు.

అబీషై ఏమంటాడో అనుకున్నాడు. సంగతి తెలిసి నప్పుడు అబీషై ఏమి మాట్లాడ లేదు. కాని దావీదు ఇప్పుడు రాజు. రాజు కాకముందు ప్రాణ భయంతో అరణ్యాలలో కొండలలో నివశించేటప్పుడు అన్ని విషయాలలో కాచుకొని వుండటం దేవుడు తన కిచ్చిన బాధ్యత అనుకున్నాడు. ఇప్పుడు అతను రాజు. అతని నడిపించి కాపు కాయ వలసినది యెహోవాయే అనుకున్నాడు.

మహనయీములో అబ్నేరు సౌలు కుటుంబాన్ని కాపా డటం కోసం కష్టపడు తున్నాడు. దావీదు నిలద్రొక్కుకొనక ముందే అణచివేయటం ఎలాగని ఆలోచిస్తున్నాడు. రెండు సంవత్సరాలలో మహనయీములో ఇష్బోషెతు నిలదొక్కు కున్నాడు అనుకున్న తర్వాత గిబియా వైపు మిగతా సైన్యంతో బయలుదేరారు. అబీషై పరిస్థితిని ఎప్పటికప్పుడు బేరీజు వేస్తూనే ఉన్నాడు. ఇశ్రాయేలు సైన్యంతో యొర్దాను దాటుచున్నాడని ముందు వర్తమానము. మరునాడు యెరూషలేమునకు నాలుగున్నర మైళ్ళ దూరములోనున్న గిబియోను వైపు వెళుతున్నారని కబురు.

అబీషై తన తమ్ముడిని పిలిచి "కొంత సైన్యం తీసుకొని గిబియోను తట్టువెళ్ళు" అన్నాడు.

"కొంచెం సైన్యం చాలదు. అతను చాలా యుక్తిగల వాడు. తన వెంట కొంత సైన్యమును మాత్రమే తీసుకొని వెళ్తాడు. నిజానికి అంతకు పదిరెట్లు సైన్యము అతనికి నాలుగు కోసుల దూరంలో వస్తుంది" అన్నాడు యోవాబు.

"అయితే నేనొక ప్రక్క ఆశాహేలు మరియొక ప్రక్కన బయలుదేరి వస్తాము" అన్నాడు అబీషై.

గిబియా కొలను వద్దకు అబ్నేరు వందమందితో కొండ ప్రక్కన నిలుచున్నాడు. యోవాబు సైన్యంతో బయలుదేరి వస్తున్న కబురు అతనికి అందింది. యోవాబు కొలను పడమటి వైపునున్న అడవిలో నుండి వచ్చాడు. ఇద్దరు ఒకరికొకరు కొంచెంసేపు చూసుకున్నారు.

అబ్నేరు తాను ఎంత సైన్యంతో వచ్చింది యోవాబుకు తెలియదు అనుకుంటున్నాడు. అందుకని తన దగ్గరున్న సైనికులలో పన్నెండు మందిని పిలిచాడు. సరే ఇది ఏమిటో చూడాలని యోవాబు కూడా తన వారిలో పన్నెండు మంది యోధులను ముందుకు పిలిచాడు. **(సశేషం)**



# ‘మహానటులు’



సినిమాల్లో, డ్రామాల్లో నటించే వారిని నటులు అంటారు కదా! బాగా నటిస్తే వాళ్ళకి ఆస్కార్ అవార్డు ఇస్తారు. సినిమా నటులు, సీరియల్ నటులు అంతా వృత్తిపరంగా నటిస్తుంటారు. అయితే జీవితంలో నటించే వారిని మహానటులు అనొచ్చు. వాళ్ళ హావభావాలు చూస్తే నటిస్తున్నారని అస్సలు అనిపించదు. క్రైస్తవులు కూడా మహానటులు అని, వాళ్ళకి ఇవ్వడానికి ఆస్కార్ కంటే పెద్ద అవార్డు లేకనే ఇవ్వలేకపోతు న్నారని చెప్తే అతిశయోక్తి మాత్రం కాదు. క్రైస్తవులు అంటే క్రీస్తుని నమ్ముతున్నామని, క్రీస్తుని వెంబడిస్తున్నామని చెప్పే వాళ్ళు. క్రైస్తవులుగా పిలువబడుతూ, చర్చీకి వెళ్ళకుండా, బైబిలు చదవకుండా, ప్రార్ధన చేయకుండా, ఎలాంటి దేవుని పని చేయకుండా అన్యజనుల్లాగా జీవించే వారిని నామకార్ధ క్రైస్తవులు అంటారు. మరి చర్చీకి వెళ్తూ, ఎక్కడ సువార్త కూడికలు జరిగినా హాజరవుతూ, వీధి సువార్తలో పాల్గొంటూ, చర్చీ కమిటీల్లో పెద్ద పెద్ద పదవుల్లో ఉంటూ, ఇంకా చెప్పాలంటే సంఘకాపరులుగా, సువార్తికులుగా ఉంటూ అన్యజనుల్లా జీవించే వారిని ఏమనాలి? ‘మహానటులు’ అనే కదా పిలవాలి. యేసుప్రభువు ‘వేషధారులారా’ అని పిలిచింది ఇలాంటి వారినే. అన్యజనుల్లా ధనసంపాదనే ధ్యేయంగా జీవించే వాళ్ళని, భూమి మీద మీ కొరకు ధనము కూర్చుకొనవద్దు అని చెప్పినా కూడా బ్యాంకుల్లో కోట్లు కూడబెట్టుకుంటూ దేవుడు మమ్మల్ని అత్యధికంగా ఆశీర్వదించాడు అని చెప్పే వాళ్ళని, ప్రభుత్వ ఉద్యోగాల కోసం సర్టిఫికేట్‌లో హిందూ అని పెట్టుకొనే వాళ్ళని, కోతెంతో విస్తారము కోతకు పనివారు లేరని తెలిసినా ఉద్యో గాలు, వ్యాపారాలు చేసేవాళ్ళని, ‘ఇదిగో దేవా నా జీవితం ఆపాదమస్తకం నీ కంకితం’ అని పాటల్లోనే భక్తి ప్రదర్శించి ఈ లోకానికి వారి జీవితం అంకితం చేసే వాళ్ళని, పైకి భక్తిగలవారివలె ఉండియు దాని శక్తిని ఆశ్రయించని వాళ్ళని ‘క్రైస్తవులు’ అని అంటారా? ‘మొట్టమొదట అంతియొకయలో శిష్యులు క్రైస్తవులనబడిరి’ (అపో.కార్య.11:26) అని చెప్పబడినవారు క్రీస్తునందు చూపించిన భయభక్తులనుబట్టి, క్రీస్తు కోసం అనుభవించిన శ్రమలనుబట్టి, ఆస్తులు అమ్మి క్రీస్తు సువార్త కోసం త్యాగం చేసిన దానినిబట్టి ‘క్రైస్తవులు’ అని పిలువబడ్డారు తప్ప ఊరికే క్రీస్తును నమ్మినందుకు కాదు. నేడు ‘క్రైస్తవులు’ అనబడేవారికి, క్రీస్తు పని చేస్తున్నామని చెప్పుకొనే సంఘకాపరులకి, సువార్తికులకి శ్రమలు ఉన్నాయా? దేవుని పని చేస్తున్నామని చెప్పుకొనేవారు, పౌలు, పేతురు, ఇతర శిష్యులవలె కష్టాలు, బాధలు, హింసలు అనుభవిస్తున్నవారు భూతద్దం పెట్టి వెతికినా మనకు కనబడతారా? ఎవరైనా తమ ఆస్తులు అమ్మి సువార్త కోసం ఖర్చు పెట్టేవాళ్ళున్నారా? సువార్త పేరు చెప్పుకొని కోట్లకు పడగలెత్తే వాళ్ళని మనం చూడటం లేదా? ‘క్రైస్తవుడైనందుకు బాధ అనుభవించే’ క్రైస్తవుడు ఒక్కడైనా కనిపిస్తాడా మనకి. క్రైస్తవుడనే వేషధారణ ధరించి అన్యజనుల్లా జీవిస్తారు. ‘అయ్యో, వేషధారులైన శాస్త్రులారా, పరిసయ్యులారా, మీరు సున్నము కొట్టిన సమాధులను పోలియున్నారు. అవి వెలుపల శృంగార ముగా అగపడును గాని లోపల చచ్చినవారి యెముకలతోను సమస్త కల్మషముతోను నిండియున్నవి’ (మత్తయి 23:27). బయటకు క్రైస్తవుల్లా కనబడుతూ, లోపల అన్యజనుల కంటే ఘోరమైన జీవితం జీవించే వాళ్ళకి ‘మహానటులు’ అనే బిరుదు ఇవ్వడం చాలా చిన్నదే. వీళ్ళ గురించి చెప్పుకోవాలంటే మనకి టైం సరిపోదులేండి.

ఫోన్‌పే లేదా గూగుల్ పే ద్వారా పత్రిక చందా పంపవలసిన ఫోన్ నంబరు
**9 4 4 0 2 1 7 7 2 6**

# మధ్యకాలము

ఆనానిల్ అనబడే ఒక యాజకుని వారసత్వము ఉన్న బబులోనీయుని ప్రధాన యాజకునిగా నియమించాడు. హేరోదు భార్య మరియమ్నే యొక్క తల్లియైన అలగ్జాండ్రా యొక్క స్నేహము ఈజిప్టు రాణి తన ప్రియుడైన మార్కు ఆంటనీతో ప్రధాన యాజకుని పదవిని మరియమ్నే తమ్ముడైన అరిస్టోబులస్‌ను ఆ పదవికి సూచించినది.

హేరోదు ఇందుకు భిన్నముగా తన వర్ధమాన చరిత్రకు జీవితానికి కారకుడైన మార్కు ఆంటనీ కోరిక మేరకు వృద్ధుడైన పార్థియన్ రాజు ప్రావోర్టిన్‌ని యెరూషలేము వచ్చునట్లు చేశాడు. తన మనస్సులో సరైన అదను చూచి చంపనాలో చించాడు. తర్వాత అరేబియా రాజైన మాల్కస్‌తో రాజద్రోహ మంతనాలు సాగిస్తున్నాడన్న నెపంతో సంహరించాడు.

ఈ లోపల అలెగ్జాండ్రా, క్లియోపాత్రతో తనకు ఉన్న సహవాసమును ఆసరాగా తీసుకొని తన కుమారుడైన అరిస్టోబులస్‌ను యూదా రాజరికములో కూడా ప్రవేశ పెట్టాలని చూచినది. కాని ఈ దురాలోచన అరిస్టోబులస్ మరణంతో, అలెగ్జాండ్రా కారాగారవాసము, ఆమె కుమార్తె మరియమ్నే మరణంతో ముగిసింది. ఈ దుఃఖకర పరిణా మాలన్నీ ముసుగులో నడిచాయి.

క్రీ.పూ. 29లో అరిస్టోబులస్ యెరికోలో ప్రమాదవశాత్తు నీళ్ళలో మునిగి చనిపోయినట్లును, మరియమ్నేకు మరణశిక్ష తీర్మానము, అలెగ్జాండ్రాకు క్రీ.పూ. 28లో మరణ దండన విధించడమైనది. కారణం వీరు హేరోదు మీద కుట్ర పన్నినట్లు నిరూపించబడటం. అమాయకులైన తన కుమారులైన అలె గ్జాండరు, అరిస్టోబులస్‌లు తన తండ్రి యొక్క కఠినత్వమునకు నొచ్చుకొని తన తల్లి మరణం విషయం వ్యతిరేకించినందున వారిద్దరు కూడా చంపబడ్డారు.

పై సంఘటనలన్నీటికి హేరోదు శిక్షించబడేవాడు కాని క్రీ.పూ. 31లో 'ఆక్టిస్' జరిగిన యుద్ధములో మార్కు ఆంటనీ క్లియోపాత్ర అగస్టస్ సీజరు చేతిలో పూర్తిగా ఓడించబడి ఆత్మహత్యలు చేసికొనిన తర్వాత 'రోడ్స్' ద్వీపములో ప్రపంచ అధినేతగా తీర్మానించబడిన 'ఆక్టాలియన్'ను కలిసికొని అతని స్తుతించి, అతని నామమును పాలస్తీనా అంతట హెచ్చించి అతనికి లోబడి దైవముగా పూజించెదననెడి వాగ్ధానములు చేసి యూదయ మీద తన అధికారమును నిలబెట్టుకొన్నాడు.

తన రక్త సంబంధీకుల మీద, భార్యబిడ్డల మీద తను అనుసరించిన కఠినత హేరోదునకు తీవ్రమైన అను తాపము కలిగించినది. అతను మానసికముగా నరకము అనుభవించి ఆలోచనలతో బలహీనుడైనాడు.

ఈ సందర్భములో తన పెద్ద కుమారుడైన ఆంటీపీటరు రాజరికములోనికి రాకమునుపు తన వ్యక్తిగత జీవితములో తనకు జన్మించిన డోరిస్‌తో కలిసి హేరోదు మీద కుట్రపన్ని యుండుట హేరోదు తెలిసికొని రోమా గవర్నరుగా సిరియాలో ఉన్న క్యుంటెలస్ వేరనస్ సమక్షమున విచారణ జరిపించి తన పెద్దకుమారునికి మరణదండన విధించాడు. ఈ సంగతి వినిన చక్రవర్తి అయిన ఆక్షాలియస్ ఈ విధంగా వాఖ్యానిం చాడు 'హేరోదు కొడుకుగా పుట్టటం కంటే అతని పందిగా పుట్టటం శ్రేష్టము' అని.

హేరోదు జరిగించిన ఆకృత్యములకు ప్రతిఫలము (తీర్పు) తప్పించుకొనుటకును, తనకు సంరక్షకుడైన ఆక్షాలియస్‌ను సంతోష పెట్టి తను గొప్పగా సంతోషించుటకుగాను రెండు పట్టణములు కట్టించి వాటికి తన సంరక్షకుని పేర్లు పెట్టాడు. మొదటిది క్రీ.పూ. 22 హెర్కెనస్ సమరయను నాశనము చెయ్యక ముందు ఉన్నచోట కట్టిన పట్టణమునకు 'సెబటా' అనగా గ్రీకుభాషలో 'అగస్టస్' అని అర్థము వచ్చునది. రెండవది ట్రాటన్ గోపురమని పిలువబడిన చోటను మధ్యధరా సముద్రపు ఒడ్డున 'సిసారియా' పట్టణమును కట్టించెను. ఒక నాటకశాల మరియొక ఆటల పోటీలు జరుగు శాలలను యెరూషలేములో కట్టించాడు. అక్కడి చక్రవర్తి గౌరవార్థము

**(మిగతా 23వ పేజీలో...)**

# నీ సృష్టికర్త

మానవ శరీరం అనేక రకాల వ్యవస్థల సంక్లిష్ట నిర్మాణం. మానవ శరీరంలోని అనేక భాగాలు వాటి పని తీరు, వాటి ప్రత్యేకతలు వంటి ఊహాతీతమైన అనేక అంశాల గురించి తెలుసుకున్నాం. ఈ సంచికలో మానవ శరీర భాగము కానప్పటికి మానవ శరీరంలో ఉంటూ శరీరానికి ఉపయోగకరమైన సూక్ష్మజీవులను గూర్చి తెలుసు కుందాం.

మనం పుట్టిన తరువాత, తల్లిద్వారా , ఆ తరువాత వాతావరణ నుండి లక్షల సంఖ్యలో రకరకాల సూక్ష్మజీవులు మన శరీరంలోకి ప్రవేపెట్టబడతాయి. మన శరీరంలోని ప్రతిభాగంలోని ఈ సూక్ష్మజీవుల ఉనికి ఉంటుంది.

ఈ సూక్ష్మజీవులు శరీక ఎదుగుదలకు ప్రత్యేకించి రోగనిరోధక శక్తిని పెంపొందించుటకు, ఆహారాన్ని జీర్ణం చేయుటకు ఇలా శరీరం యొక్క ప్రతి కీలకమైన విధిలోను ఇవి ముఖ్య పాత్రను పోషిస్తాయి.

మన శరీరంలో దాదాపుగా రెండు కేజీల బరువు ఉండే సూక్ష్మజీవులు ఉంటాయి. ఈ బరువు మన మెదడు బరువు కంటే ఎక్కువ.

మన శరీరం కణాల సముదాయమని మీకు తెలుసు కదా. మానవ శరీరంలో కణాల సంఖ్య 10ట్రిలియన్ (1,00,00,00,00,00,000) కాగా సూక్ష్మజీవులు 100 ట్రిలియన్‌లు (10,00,00,00,00,00,000) అంటే మన శరీర కణాల కంటే సూక్ష్మజీవుల సంఖ్యే ఎక్కువ.

మన నోట్లోని లాలాజలంలో దాదాపు 2వేలకోట్ల (2000,00,00,000) సూక్ష్మజీవులు ఉంటాయి. ఈ సంఖ్య భూమీ మీద ఉన్న మనుష్యుల కంటే మూడు రెట్లు ఎక్కువ. నోట్లోని ఈ సూక్ష్మ జీవులు మన ఆహారం జీర్ణమవ్వడంలో చాలా ప్రాముఖ్యమైన పాత్రను పోషిస్తాయి.

కేవలం లాలాజలంలోనే కాదు పంటి మీద కూడా సూక్ష్మజీవులు ఉంటాయి. ఒక్కో పంటి మీద దాదాపుగా లక్ష (1,00,000)సూక్ష్మజీవులు ఉంటాయి.

మానవుని నాభిలో దాదాపుగా 1458 రకాల జాతుల సూక్ష్మజీవులు ఉంటాయట. ఈ సూక్ష్మజీవులు వ్యాధినిరోధక శక్తిని పెంచడానికి ఉపయోగపడతాయి. అంటే శరీరంలోకి ప్రవేశించిన హానికరమైన క్రిములను ఎదుర్కొనుటకు సమర్థవంతమైన యాంటిబాడీస్‌ను తయారుచేసి శరీరం రోగాల బారిన పడకుండా కాపాడతాయి.

మానవ శరీరంలో 20,000 జీన్స్ ఉండగా, సూక్ష్మజీవులు 20మిలియన్లు (2,00,00,000) ఉంటాయి. అంటే ఏ విధంగా చూసిన మన శరీరంలో అత్యధికంగా ఈ బాక్టీరియానే ఉంటుంది.

ఈ సూక్ష్మజీవులు అత్యధికంగా చర్మంపైన ఉంటాయి. ఇవి చర్మంపైని మృతకణాలను తిని జీవిస్తాయి. జీర్ణాశయం లోను అధిక సంఖ్యలో ఈ సూక్ష్మజీవులు ఉంటాయి అనవచ్చు. జీర్ణాశయంలో దాదాపుగా 3,80,000 బిలియన్‌ల (3,80,00,00,00,00,00,000) సూక్ష్మజీవులు ఉంటాయి. ఆశ్చర్యకరమైన విషయమేమంటే ఈ బాక్టీరియా ప్రతి ఒక్కరికి ప్రత్యేకంగా ఉంటుంది. అందుకే ఒక్కొక్కరికి ఒక్కో రకమైన ఆహారం అంటే ఇష్టం ఉంటుంది. అంటే వాస్తవానికి మనకి ఇష్టమైన ఆహారం మన ఇష్టం కాదు మన జీర్ణాశయంలో ఉన్న సూక్ష్మజీవుల ఇష్టమైన ఆహారం.

శరీరంలో ఉంటూ శరీరానికి ఎంతో ఉపయోగపడే ఈ సూక్ష్మజీవులు మన శరీరంలో ఉన్నంతకాలమే మనం జీవించి ఉంటాము. అవి లేకుండా మనిషి మనుగడ లేదు. మనిషి జీవించి ఉండడానికే కాక మనం చచ్చాక మన శరారాన్ని అది పూర్తిగా కుళ్ళి నేలలో కలిసిపోవడానికి కూడ ఈ సూక్ష్మజీవులే ఉపయోగపడతాయి.

కంటికి కనిపించని సూక్ష్మజీవులు సైతం దేవుడు తమకిచ్చిన పనిని ఇంత చక్కగా నిర్వర్తిస్తుండగా మానవులు దేవుని మరచుట ఎంతవరకు సమంజసం? ఆలోచించండి.

సాక్ష్యము

# పాల్ గోవిందరెడ్డి

**ప్రభువు "అన్యజనుల యెదుట నా నామము భరించుటకు ఇతడు నేనేర్పరచుకొనిన సాధనమునై యుండి యున్నాడు. అపొ.కా. 9:15**

కడపజిల్లా రాయచోటి మండలానికి చెందిన "చెన్నముక్కపల్లె" గ్రామంలో 1914సం॥లో గోవింద రెడ్డిగారు జన్మించెను. తండ్రి గంగిరెడ్డిగారు. చిన్నతనమందే తల్లి చనిపోవుట వలన బాల్యం నుండి శ్రమల ద్వారా వెళ్ళవలసివచ్చెను. చదువులో దిట్ట. పైచదువులు చదువుటకు అవకాశములేక ఉపాధ్యాయవృత్తిలో తర్ఫీదు పొంది కడపజిల్లా, వీరబల్లి మండలం "గడికోట"లో ఉపాధ్యాయు నిగా పనిజేసెను. పిల్లలను విద్యలోనే గాక శరీరవ్యాయామ లోనూ తర్ఫీదునిచ్చి వారిని ఆరోగ్యవంతులుగా తీర్చి దిద్దేవాడు. గోవిందరెడ్డిగారు ఉదయాన్నే సాముగండీలను జేస్తూ ప్రతిరోజు 2000 బస్కీలు తీసేవారు. గ్రామప్రజలకు రాజకీయాలను గూర్చి, దేశపరిస్థితులను గూర్చి బోధించి వారిని చైతన్యవంతులనుగా జేయుచుండెను. బాండ్లు వ్రాయించి ఇచ్చుట, పెండ్లి పత్రికలు రాసి ఇచ్చుట ద్వారా ఆ గ్రామంలోని వారికందరికి ప్రముఖుడై యుండెను. సలహాల కొరకు అందరు ఆయనను ఆశ్రయించేవారు.

**పేరు పెట్టి నిన్ను పిలిచి యున్నాను. నీవు నా సొత్తు. యెష 43:1. నేనతనికి తండ్రినై యుందును, అతడు నాకు కుమారుడై యుండును. 2సమూ 7:14.**

గోవిందరెడ్డిగారు గడికోటలో ఉద్యోగము జేసే సందర్భములో అడాల్ఫ్రుంపస్ అను ఒక మిషనరీ, ప్రభువు ప్రేరేపణ ద్వారా సేవ జేయుటకు స్విట్జర్లాండు నుండి ఇండియాకు రావడము జరిగినది. ఆ దైవజనుడు కడపలో సువార్తసేవ జేస్తూ గడికోటకు రావడం జరిగినది. ఒక సమావేశములో రుంపస్ దొరగారు వారి దేశ సంస్కృతిని గురించి మాట్లాడుతూ యంత్రములద్వారా వ్యవసాయంజేస్తారని, సమృద్ధి గల దేశమనియు యేసుక్రీస్తు లేకుండా ఏ దేశము కూడా సంపూర్ణతకానేరదని ప్రభువును గూర్చి ప్రకటించడం జరిగింది. యేసుక్రీస్తు ప్రస్తావన వచ్చినపుడు గోవిందరెడ్డిగారు అద్భుతగిలి, రుంపస్ గారితో – మీ దేశరాజకీయ పరిస్థితులు, వ్యవసాయ పద్ధతులను గూర్చియే మాట్లాడమంటిని మీ యేసుప్రభువును గూర్చి చెప్పుమనలేదు. మాకు 33కోట్ల దేవతలున్నారు. యేసుతో మాకెంతమాత్రం అవసరం లేదని ఎదిరించెను. ఇరువురి మధ్య చాలా సేపు తర్కవితర్కము జరిగిన పిమ్మట ఆఖరున మిషనరీ, గోవిందరెడ్డిగారితో పాపాత్ముడైన మానవుని కొరకు ప్రాణం పెట్టి, సమాధిని జయించి, మూడవదినాన లేచిన మహానుభావుడెవరైనా మీ గ్రంథాలలో ఉంటే చూపమని అడిగినప్పుడు గోవిందరెడ్డిగారు ఉత్తరమియ్య లేకపోయిరి. ఇదే అదననుకొని రెవ.రుంపస్ గారు యేసు ప్రభువును గూర్చి మరింత స్పష్టంగా వివరించి బైబిలును కానుకగా ఇచ్చి శ్రద్ధగా దానిని పఠించినట్లయితే ప్రభువు మాట్లాడగలడని చెప్పి వెళ్లిపోయాడు. నిజదేవుడెవరో తెలిసికొనగోరిన గోవిందరెడ్డిగారు ఆ రాత్రే దీపం వెలుతురులో బైబిలు చదవనారంభించెను. చదువుతున్న కొలది ఆయనలో ఏదో నూతన శక్తి ప్రవేశించినట్లుంది, తన్మయత్వంతో నింపబడసాగెను. ముందెన్నడూలేని సంతోష, సమాధానాలతో నింపబడి ప్రభువును స్తుతింప సాగెను. ప్రభువు ఏర్పాటులోనున్న గోవిందరెడ్డిగారిని దేవుడు ఆ రాత్రి అద్భుతరీతిలో రక్షించెను.

**నమ్మిన ఈ సూచకక్రియలు కనబడును. ఏమనగా నా నామమున దయ్యములను వెళ్ళగొట్టుదురు. మార్కు 16:17.**

గడికోట గ్రామంలో దయ్యముల చేత వేదింపబడు స్త్రీ ఆ గ్రామ ప్రజలను కలవరపెట్టుచు, నెమ్మది లేకుండ జేయుచుండెను. పెద్దలను రాళ్ళతో కొట్టి తరుముట, పిల్లలను ఎత్తుకొని పారిపోయి ఏదో ఒక చోట విడిచి వచ్చుటద్వారా వారిని భయభ్రాంతులను జేయుచుండెను. ప్రభువు వాక్యమును సంపూర్ణంగా నమ్మి విశ్వాసముంచిన గోవిందరెడ్డిగారు ఆ స్త్రీ కొరకు ప్రార్థించి "దెయ్యమా ఆ స్త్రీని విడిచి వెళ్ళమని యేసునామమున ఆజ్ఞాపించు చున్నాననగానే ఆ స్త్రీ మిక్కిలి వేగంతో పరుగెత్తి సమీపం

లోనున్న తాటిచెట్టు కింద కూలబడుట, ఆమెని విడిచిన దయ్యం తాటిచెట్టులో ప్రవేశించి తాటిచెట్టును గడగడ లాడించుట, ఆ స్త్రీ స్వస్థతపొందుట చూచిన ఊరివారు ప్రభువును సంతోషంగా అంగీకరించిరి.

అప్పటికింకా గోవిందరెడ్డిగారికి వివాహంకాలేదు. ఆయనకున్న సేవా పిలుపునుబట్టి ఉద్యోగమును విడిచిపెట్టి ప్రభువును వెంబడించుటకు తీర్మానించుకొని మిషనరి రుంపస్ గారిని కలిసికొనెను. రుంపస్ గారు గోవిందరెడ్డిగారిని చేర్చుకొని యేసును ఎరుగని అన్యజనులకు సువార్త ప్రకటించుటకై ప్రత్యేకించెను. ఆ కాలంలో క్రైస్తవులను హీనంగా చూచేవారు. వివాహం నిమిత్తం ఎంతో కాలం కనిపెట్టి ప్రార్థించవలసివచ్చెను. చివరకు బంధువులలో ఒకరు తన కుమార్తె నిచ్చుటకు ముందుకు వచ్చెను. కనీసం ఇద్దరు పెద్దలను వివాహానికి పిలుచుకో గలిగితే వధువునిచ్చి వివహము చెయ్యగలనని మాట ఇవ్వగా, మిషనరీలు రుంపస్, ఫాక్స్ దొరగారి ఆధర్యంలో జయంతమ్మగారిని వివాహం చేసుకొనిరి. క్రైస్తవుడగుటయే గాక, క్రైస్తవ ఆచారంప్రకారం వివాహం జేసుకొనుట వలన తన కుమారుడు చెడిపోయినాడని తండ్రి గంగిరెడ్డి గారు వివాహంలో ఉండుటకిష్టపడలేదు కొన్ని సం॥ల తర్వాత కుమారుడు ప్రభువును గూర్చి చెప్పి, ఒప్పించి బాప్తిస్మ మియ్యగా ప్రభువులో నిద్రించినాడు. కులం పోగొట్టుకొని చెడిపోయినాడని బావికి నీళ్లకు రానియ్యకుండా వెలివేసిరి. సొంతఅక్క ఇంటిలోనికి చేర్చుకొనుటకు ఇష్టపడక పశువుల కొట్టంలో అన్నం పెట్టి పంపివేసెను. వీటన్నిటిని ప్రభువు కొరకు సంతోషంతో సహించి, స్థిరమనస్సుతో ప్రభువును వెంబడించుట జరిగింది.

మిషనరి రుంపస్ గారితో కలిసి సేవజేసే దినాలలో భక్తిసింగ్ గారిని కలిసికొని వారి సేవపరిచర్య విధానము, క్రమమును గూర్చి విన్న గోవిందరెడ్డిగారు భక్తిసింగ్ గారితో సేవజేయుటకు తీర్మానించుకొనెను. ఇట్టి సాక్ష్యము గలిగి ప్రభువు కొరకు ప్రయాసపడేవారు అవసరమని గుర్తెరిగిన భక్తసింగ్గారు సహవాసము, మరియు తర్ఫీదు కొరకు హైదరాబాదులోని అప్పుడున్న ఏలీముకు ఆహ్వానించినాడు. ఏలీము నుండి సేవకునిగా మదనపల్లె, మదనపల్లె నుండి రాయచోటికి పంపబడినారు. అప్పటికి రాయచోటిలో మందిరము లేదు. ఒక చిన్నగది అద్దెకు తీసుకొని బస్టాండు సమీపంలో సేవనారంభించెను. బహు కొద్దిమంది దాదాపు 3, 4 కుటుంబాలు కూడుకొనుచుండిరి. తరువాత దాదాపు 60 మందితో సమాజము ఏర్పడెను. మందిరం కొరకు ప్రార్థించగా రాయచోటి బేతేల్ కాలనిలో 25 సెంట్లు గల భూమిని కొనుటకు ప్రభువు సహాయం చేసెను. 1978 డిసెంబరు 31న ఒక చిన్న పెంకుటిల్లుతోపని ఆరంభమాయెను. పరిచర్య విస్తరించి మందిరం చాలకపోవడంతో ప్రస్తుతమందున్న పెద్దమందిరము పాల్ గోవిందరెడ్డిగారి ఆధ్వర్యంలో దైవజనుడైన భక్తసింగ్ గారి ద్వారా 1986 మార్చి 3వ తేదిన 'మిస్పా' ప్రార్థనా మందిరంగా ప్రతిష్ఠింపబడింది. మొక్కవోని విశ్వాసముతో ఆత్మల రక్షణార్థమై పట్టువదలక జేసిన పరిచర్య, మరియు సాక్ష్యాన్ని బట్టి అనేకులు ప్రభువును విశ్వసించిరి. విగ్రహారాధన చేసే బంధువులు అనేకులు ప్రభువును నమ్ముటే కాక ప్రభువు కొరకై నిలబడి సంఘ విస్తరణ కొరకు ప్రయాసపడుతున్నారు.

పాల్గోవిందరెడ్డిగారి కమారులు, విజయ కుమార్, సాల్మన్, డేవిడ్, ఏలియా, రాజా, మనోహర్, పాల్, జోసఫ్ అందరూ రక్షింపబడి 'మిస్పా' లో మూలకంబములుగా ఉన్నారు. వీరిలో సాల్మన్రెడ్డి ఖమ్మంలో (ఎల్లన్నద్దయి) దైవసేవకునిగా, ఏలియారెడ్డి కోర్బాలో (చత్తీస్గడ్) సంఘ నిర్మాణకునిగా బిలాయ్, డోంగర్గడ్ సంఘాలకు సహాయకరంగా ఉంటుండగా మిగిలిన వారు 'మిస్పా'లో పెద్దలుగావుండి పరిచర్యలో సహకారులుగా ఉన్నారు.

**మంచి పోరాటము పరుగు కడముట్టించుట 2తిమోతి 4:7**

వృద్ధాప్యము ముంచుకురాగా చివరి దినాలలో చక్కెర వ్యాధి ఇబ్బంది పెట్టసాగెను. ఆయన అనారోగ్యమును లెక్కచెయ్యకుండా చివరిక్షణము వరకు సేవలో ప్రయాస పడినారు. అది జనవరి 3వ తేది 1991వ సంవత్సరము ప్రత్యేక కూడిక నిమిత్తము ఇంటి నుండి బయలుదేరుటకు ఆయత్తపడుచుండగా ప్రభువు పిలుపు మేరకు పరలోక గృహములో ప్రవేశించెను.

# కొడవటికంటి సామ్యేల్ రాజేంద్రగారి ప్రస్థానం

తండ్రి : కొడవటికంటి కృపాదానం
తల్లి : కూచిపూడి హన్నమ్మ 12 మంది సంతానములో జ్యేష్ఠకుమారుడు
ప్రాథమిక విద్య : 1947 విట్టికర్ గార్ల్స్ స్కూల్, సామర్లకోట, తూ.గో జిల్లా
మాధ్యమిక విద్య: 7వ తరగతి, గొల్లపూడి హైస్కూల్, మర్సపూడి, నూజివీడు, 1952-1957, ఎ.బి.యం.హైస్కూల్, ఒంగోలు
పి.యు.సి. : 1958 ఎ.సి.కాలేజి, బాప్టిస్టు స్టూడెంట్స్ సెంటర్, కన్నావారితోట, గుంటూరు (విలియంకేరి)
డిగ్రీ : 1959 బి.ఎ. 3 సం॥లు సి.యస్.ఆర్.శర్మకాలేజి, ఒంగోలు (మొదటి బ్యాచ్)
ఎన్.సి.సి. : 'బి' సర్టిఫికేట్, శర్మకాలేజి, ఒంగోలు
ఉద్యోగం : 1961లో డి.యం.అండ్ హెచ్.యస్, హైదరాబాద్‌లో జూనియర్ అసిస్టెంట్
వివాహము : 1964 జనవరి 4న వివాహము

H ఒంగోలులో స్థాపింపబడిన క్లౌ యూనియన్‌నకు మొదటి ప్రెసిడెంట్ రావూరి కృపారావుగారు. తదుపరి మూడు పర్యాయాలు కొడవటికంటిగారు ప్రెసిడెంట్‌గా ఎన్నికైనారు.

H 1963లో రామాయపట్నం బైబిల్ సెమినరీ యూత్ రిట్రీట్‌లో-మారిష్ బ్లాశ్చర్డ్ మరియు జి.ఆర్.క్రోగార్ల దైవ వర్తమానములో క్రీస్తును స్వరక్షకునిగా అంగీకరించుట

H 1964లో ఒంగోలు టౌన్ సి.ఇ ర్యాలికి ప్రెసిడెంట్‌గా ఎన్నిక

H 1964లో క్రొత్తపట్నం దేవునితోటలో అనాథ శరణాలయము ప్రారంభం.

H 1965లో రెవ. బెంజిమెన్ కృపానిధి, రెవ. స్కాట్‌గార్ల గ్లాడ్ టైడింగ్స్ పబ్లికేషన్, కరీంనగర్ వారి సహకారంతో ఒంగోలులో క్రైస్తవ పుస్తకశాల స్థాపన.

H 1966లో ట్రూత్ ప్రింటింగ్ ప్రెస్ ఒంగోలులో స్థాపన

H 1972 ఆగష్టులో 'వరల్డ్ విజన్' ఆహ్వానం మేరకు అమెరికాలోని పాసడీనా, కాలిఫోర్నియా సందర్శన.

H 1977-1979 భారతి ప్రింటింగ్ ప్రెస్ ఒంగోలులో స్థాపన (గవర్నమెంట్ గజిట్ ప్రింటింగ్).

H 1992-1995 మద్రాసులోని ఇండియా బైబిల్ లిటరేచర్ వారి స్కూల్ ఆఫ్ ఇవాంజలిజమ్‌లో కరస్పాండెంట్‌గా మరియు లిటరసీ ఇండియా ట్రస్ట్ వారి వయోజన విద్య కార్యక్రమంలో ప్రాజెక్ట్ ఆఫీసరుగా సేవలు.

H 1995లో 'మడిమెను పట్టుకొనినవాడు' తొలి పుస్తక రచన ప్రారంభం.

H 1995-2019 వరకు వారి రచనలు మొత్తం 40 పుస్తకాలు ప్రచురించబడ్డాయి.

H 1999 నుండి 'హన్నాకృప' మాసపత్రికను నడిపిస్తున్నారు.

H చివరి పుస్తకము 'మిక్కిలి సాత్వికుడు' (మోషే కథ)



H 1-5-2002న బెంగుళూరులోని 'గుడెషెపర్డ్ బైబిల్ కాలేజి' రెవ. డా॥ జి. రాజేశ్వరరావుగారి ద్వారా గౌరవ డాక్టరేట్ ప్రదానం చేయబడింది.

H 2012లో ఆల్ ఇండియా రేడియో డైరెక్టర్లుగా కొనసాగిన శ్రీమతి డా॥ ఝాన్సీ కె.వి.కుమారి, శ్రీ డా॥ నల్లూరి బాబూరావుగార్లు కొడవటికంటిగారి సాక్ష్యాన్ని రికార్డు చేసి

1-11-2012న ఆంధ్రప్రదేశ్ అవతరణ రోజున ఆల్ ఇండియా రేడియోలో ప్రసారం చేశారు.

H 2-12-2012న హైదరాబాద్‌లోని శ్రీ పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయంలో రెవ.డా॥ దాసుబాబుగారిచే పుస్తకావిష్కరణ మరియు సన్మానము.

H 5-12-2012న డా॥ యన్. జయకుమార్‌రావుగారి ఆధ్వర్యంలో కవి, గేయ రచయిత శ్రీ జాలాదిగారిచే విశాఖ పట్నంలో సన్మానం.

H 2001లో బిషప్ మూర్తోటి సంపత్ శాంతవర్ధన్‌గారిచే కొడవటికంటిగారి రెండవ నవల 'ఆసెనతు'ను చలనచిత్ర దృశ్యకావ్యంగా నిర్మించుటకు సన్నాహము జరిగినది. వారు మహిమ ప్రవేశము చేసిన తర్వాత వారి సేవకాడిని మోయు చున్న జ్యేష్ఠ కుమారుడు షాలి విక్రాంత్‌వర్ధన్‌గారు ఆసెనతు సినిమా నిర్మించుటకు పూనుకొని 25-12-20 తేదీన ప్రదర్శనకు సన్నాహము చేయుచున్నారు.

H 21-12-2013న గౌరవనీయులు మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిగారిచే జూబ్లీహాలు హైదరాబాద్‌లో "గొప్ప క్రైస్తవ రచయిత" అవార్డు స్వీకరణ




H 03-07-2023న ప్రభువునందు నిద్రించెను.



## కొడవటికంటిగారి రచనలు

| | | |
|---|---|---|
| 1. | మడిమెను పట్టుకొనినవాడు | రూ. 40 |
| 2. | జప్నత్పనేహు | రూ. 45 |
| 3. | ఆసెనతు | రూ. 150 |
| 4. | అపొస్తలుడు | రూ. 60 |
| 5. | బర్నబా | రూ. 30 |
| 6. | తిమోతి | రూ. 40 |
| 7. | నా చిత్తానుసారుడు | రూ. 110 |
| 8. | గుంట నుండి మింటికి | రూ. 50 |
| 9. | విశ్వాసంలో ఓ మెట్టు | రూ. 60 |
| 10. | విశ్వాసంలో మరో మెట్టు | రూ. 65 |
| 11. | తోటలో పనివాడు | రూ. 20 |
| 12. | గోత్రకర్త (యాకోబు) | రూ. 50 |
| 13. | నా కుటుంబము | రూ. 25 |
| 14. | నా దూత (బాప్తిస్మమిచ్చు యోహాను) | రూ. 50 |
| 15. | నా కుమారి (రూతు) | రూ. 60 |
| 16. | నా స్నేహితుడు | రూ. 50 |
| 17. | అంత్యదినములలోని యదార్థ ప్రవక్త | రూ. 50 |
| 18. | హన్నాకృప సజీవసాక్ష్యాలు -1 | రూ. 65 |
| 19. | హన్నాకృప సజీవసాక్ష్యాలు -2 | రూ. 65 |
| 20. | ప్రయాణంలో ఓ మజిలి | రూ. 65 |
| 21. | నాజరు (సమ్సోను జీవిత చరిత్ర) | రూ. 65 |
| 22. | సువార్తలలోని యేసుకథ | రూ. 75 |
| 23. | యేసుకథ రెండవ భాగం | రూ. 75 |
| 24. | యేసుకథ మూడవ భాగం | రూ. 75 |
| 25. | జీవనమంతయు | రూ. 40 |
| 26. | టాల్‌స్టాయ్ కథలు 1 భాగము | రూ. 65 |
| 27. | టాల్‌స్టాయ్ కథలు 2వ భాగము | రూ. 65 |
| 28. | ఓ చినుకునవుతా... | రూ. 30 |
| 29. | పరలోకము - నరకము | |
| 30. | విశ్వాసము విజయము-1 | రూ. 70 |
| 31. | విశ్వాసము విజయము-2 | రూ. 70 |
| 32. | విశ్వాసము విజయము-3 | రూ. 70 |
| 33. | హదస్సా | రూ. 70 |

పుస్తకములు కావలసినవారు :
రెవ. డా॥ కొడవటికంటి ఇమ్మానియేల్ రాజేంద్ర
కృపాదానంగారివీధి, క్లౌపేట, 6వ లైను
ఒంగోలు-523001
ప్రకాశం జిల్లా, ఫోన్ : 9440217726

# ఆందోళన

**(ఒక నిశ్చలమైన హృదయానికి దేవుని సమాధానం)**

ఈ రోజుల్లో ప్రతి మనిషికి ఏదో ఒక విషయంలో ఆందోళన ఉంటుంది. ఆరోగ్యంపై, కుటుంబంపై, భవిష్యత్తుపై గర్భధారణపై, ఉద్యోగంపై. అయినా కుడా ప్రతి ఆందోళనకు దేవుని వాక్యములో సమాధానం ఉంది.

**1) దేవుడు శాంతి, సమాధానములకు మూలము**

మీ సమస్త చింతలను ఆయన మీద వేయుడి, ఆయన మీయందు శ్రద్ధ వహించును (1పేతురు 5:7). మన ఆందోళనలను మనం అణచివేయాల్సిన అవసరం లేదు. దానిని దేవుని చెంతకు తీసుకెళ్లాలి. మనకు ఏ బాధ ఉన్నా ఆయన వింటాడు.

**2) విశ్వాసము**

మనకు ఆందోళన ఉంటే భయం కలుగుతుంది. మనం భయాన్ని విశ్వాసంతోనే జయించగలం. నేను నీ దేవుడనై యున్నాను దిగులుపడకుము నేను నిన్ను బలపరతును నీకు సహాయము చేయువాడను నేనే నీతియను నా దక్షిణ హస్తముతో నిన్ను ఆదుకొందును. (యెషయా 41:10) నిబ్బరము గలిగి ధైర్యముగా నుండుము, దిగులుపడకుము జడియకుము. నీవు నడుచు మార్గమంతటిలో నీ దేవుడైన యెహోవా నీకు తోడైయుండును (యెహోషువ 1:9). భయ పడకుడి, వారిని చూచి దిగులుపడకుడి, నీతో కూడ వచ్చు వాడు నీ దేవుడైన యెహోవాయే; ఆయన నిన్ను విడువడు నిన్నెడబాయడు (ద్వితీయో. 31:6), నాకు భయము సంభ వించు దినమున నిన్ను ఆశ్రయించుచున్నాను. (కీర్తనలు 56:3).

ఇలా అనేకమైన వాక్యాలు దేవుడు మనకు మన భయం నుంచి దూరం చేయడానికి ఇచ్చాడు. దేవుని వాక్యాన్ని మన హృదయంలో పదే పదే గుర్తు చేసుకుంటుంటే భయం మన విశ్వాసాన్ని తగ్గించదు, కానీ మన విశ్వాసం భయాన్ని వెళ్ళగొడుతుంది.

**3) ఆందోళనను ప్రార్థనతో జయించండి.** (ఫిలిప్పీ. 4:6) మన ఆందోళనను ప్రార్థన ద్వారా దేవునికి అప్పగించాలి. అది మన హృదయానికి ఒక ప్రత్యేకమైన శాంతిని ఇస్తుంది. ఈ లోకంలో మనకు తాత్కాలికమైన శాంతి దొరుకుతుంది.

**4) మనకు ఆందోళన కలిగినప్పుడు మనం చేయవలసినవి.**

– ప్రతిరోజు బైబిల్ చదవడం మరువకూడదు.

– ప్రార్థనను అలవాటుగా మార్చుకోవడం.

– మీరు భయవడుతున్న విషయాన్ని దేవుని చేతికి అప్పగించండి

– భయాన్ని వేదనగా కేకుండా, దేవుని సమీపానికి తీసుకెళ్ళే మార్గంగా మార్చండి.

– ఆందోళన మనసుకు బాధను కలిగిస్తుంది. కాని దేవుడు బాధలో దేవుడు మనల్ని ఒంటరిగా వదలడు.

వారి యావద్బాధలో ఆయన బాధనొందెను ఆయన సన్నిధి దూత వారిని రక్షించెను ప్రేమచేతను తాలిమిచేతను వారిని విమోచించెను పూర్వదినములన్నిటను ఆయన వారిని ఎత్తికొనుచు మోసికొనుచు వచ్చెను. (యెషయా 63:9). "వారు పెట్టిన మొరను వింటిని, వారి దుఃఖములు నాకు తెలిసేయున్నవి (నిర్గమ. 3:7).

ఆయన మన దుఃఖాన్ని తెలుసుకుంటాడు. మనం మన హృదయంలోని బాధని ఆయనకు తెలియజేసినప్పుడు ఆయన శాంతి మనకు అనుగ్రహించబడుతుంది. శాంతి మీ కనుగ్రహించి వెళ్లుచున్నాను; నా శాంతినే మీ కనుగ్రహించు చున్నాను; లోకమిచ్చునట్టుగా నేను మీ కనుగ్రహించుటలేదు; మీ హృదయమును కలవరపడనియ్యకుడి, వెరవనియ్యకుడి. (యోహాను 14:27).

"నా అంతరంగమందు విచారములు హెచ్చుగా నీ గొప్ప ఆదరణ నా ప్రాణమునకు నెమ్మది కలుగజేయుచున్నది" (కీర్తనలు 94:19).

**డా॥ కె. హారిక ప్రజ్వలిత్**

# మదర్ తెరీసా

మదర్ తెరీసా తన పేరును ఆ రోజుల్లో ఎంతో ప్రసిద్ధమైన సెంట్ తెరీస్సా ఆఫ్ ఆవీలా నుండి కాదుగాని చిన్నమొగ్గ అయిన సెంట్ తెరిసా ఆఫ్ లిసిఎక్స్ నుండి తీసుకుంది. ఆమె నిర్ణయంలోని నిరాడంబరము, తగ్గించుకొనే గుణము కనిపిస్తుంది. వారు మనసులో ముద్రవేసుకొనిన సెయింట్ పేరును వారు పెట్టుకోవచ్చు. ఆగ్నెస్‌ను బహుగా ఉత్తేజపరచిన లిసీయ నగరవాసి థెరిస్సాను (1873-97) సెయింట్‌గా 1925 పోప్ ప్రకటించారు. ఆమె 24 సంవత్సరాల వయస్సులోనే టి.బి. వ్యాధితో చనిపోయినది. 15 సంవత్సరాల వయసులో పోప్‌గారి అనుమతితో సిస్టర్‌గా చేరి, ''ప్రేమ నా జీవితాశయం. అదే నా సేవకు పిలుపు. నేను చేసే ప్రతి పనిలోను ప్రేమ కనిపించాలి" అన్న సెయింట్ థెరిస్సా జీవిత చరిత్ర ఆగ్నెస్‌కు ఎంతో సంతోషాన్ని, నూతనోత్తేజాన్ని నింపాయి. అప్పటికే ఒకరు సెయింట్ థెరీస్సా పేరు పెట్టుకున్నందున ఆగ్నెస్ స్పానిష్ స్పెల్లింగ్‌తో వున్న 'తెరిసా' పేరు పెట్టుకుంది. బెటికా పేరును సిస్టర్ మేరీ మగ్దలేనెగా పెట్టుకుంది.

ఆగ్నెస్ అలియాస్ సిస్టర్ తెరీసా తన మొట్టమొదటి వాగ్దానముతో తన మఠ జీవితాన్ని ప్రారంభించింది. యెషయా 54:5 'నిన్ను సృష్టించిన వాడు నీకు భర్తయై యున్నాడు'. ఆమె దేవునికి పెండ్లికియ్యబడినది. ఆయనకు సంపూర్తిగా, నిస్వార్ధంగా సేవ చేయుటకు కేటాయించ బడినది. ఆ నేపథ్యం లోనే ఆమె పేరును సిస్టర్ తెరీసాగా ఎంచుకుంది. రెండు సంవత్సరాల పాటు వీరికి శిక్షణ ఇవ్వబడింది. మొదటి సంవ త్సరం బైబిలు చదవటానికి, దైవిక కార్యాల్ని నెరవేర్చుటకు అనేకమైన వాక్యాలు, కీర్తనలు, దేవునికి జీవితాలను అర్పించిన వారి ధీరగాథలు అన్నీ నేర్పిస్తారు. రెండవ సంవత్సరంసెయింట్ ఇగ్నీషియాస్ లయోలగారు ప్రబోధించిన ఆధ్యాత్మిక అభ్యా సాలు నాలుగు అంచెలుగా నేర్పబడుతుంది. ప్రతి ఒక్కరు తమ జీవిత పాపాన్ని పూర్తిగా ఒప్పుకొనుట. రెండవ శకంలో ప్రతి ఒక్కరు వారి పూర్ణ హృదయముతో మనసుతో క్రీస్తు ప్రభువు ఈ లోకములో గొప్ప శక్తిమంతుడై పునరుత్థాన శక్తితో వున్నాడని విశ్వసించుట, మూడవదిగా ప్రతి ఒక్కరు క్రీస్తు ప్రభువుతో జతపనివారిగా మార్చబడినారనే నిశ్చయత కలిగి వుండటం. చివరిగా క్రీస్తు ప్రభువుతో కలిసి చేసిన పనికి బహు మానాన్ని పొందుకోవడము తోటిపనివారి ప్రేమను చూరగొనడం. అంటే ప్రతి విషయములోనూ అన్నింటిలోను దేవుని కనుగొనుట. ఆత్మీయత ఆరాధనగా మారి ఆచరణలోకి రావాలి. ప్రార్ధించుట, సేవచేయుట, ప్రతిపాదించుట, సఫలీ కృతము చేయుట. ప్రతిరోజూ వారి విశ్వాసాన్ని పరీక్షించు కొనుట. సంవత్సరానికోసారి ఆత్మీయస్థితిలో స్థిర పడడానికి సంవత్సరాంత రిట్రీటుకి వెళ్ళేవారు.

సిస్టర్ తెరీసా స్కూలు పిల్లలకు పాఠాలు చెప్పడం మొదలుపెట్టింది. నర్సులకు సహాయకారిగా కూడ ఉండటం మొదలుపెట్టింది. ఆ రోజుల్లో బ్రిటీషు తెల్లదొరలు ఇండియా దేశస్థుల్ని ఎంత చిన్నచూపు చూసేవారో ఆమె అర్ధం చేసుకుంది. ఒకసారి సిస్టర్ తెరీసా ఒక సంభాషణ విన్నది. ఒక భారతీయుడు ఇంకొకనితో 'నీవు బ్రిటీషు రాజును ద్వేషిస్తావా లేక వడ్డీ వ్యాపారస్తుడిని ద్వేషిస్తావా?' అని అడిగినప్పుడు 'బ్రిటీష్ రాజునే' అని ఠక్కున చెప్పి ఎందుకో వివరణ కూడా ఇస్తూ 'వడ్డీ వ్యాపారస్తుడు తన డబ్బు తిరిగి వచ్చేంత వరకు నేను బ్రతికి వుండాలని కోరుకుంటాడు. కాని ఈ బ్రిటీష్‌రాజు నేను చచ్చినా బ్రతికినా పట్టించుకోడు' అని చెప్పాడు.

డార్జిలింగ్‌లోని ప్రశాంత వాతావరణంలో రెండేళ్ళు శిక్షణ పూర్తి చేసిన తరువాత 1931 మే నెల 24న సిస్టర్ తెరీసా తన పేదరికం, పరిశుద్ధత, విధేయత పట్ల ప్రథమ వాగ్దానాలు చేసింది పేదరికమనే వాగ్దానంలో నాకున్న

సర్వస్వాన్ని వది లేస్తున్నానని మోకరించి చెప్పింది. అలాగే తన పరిశుద్ధత గురించి వాగ్దానం చేస్తూ, తన హృదయంలో దేవునికి తప్ప మరెవరికీ స్థానం లేదని వాగ్దానం చేసింది. ఎందుకంటే ఆమె శరీరం దేవునికి ఆలయమై ఉన్నది. ఆ శరీరంతో ఎల్లవేళలా తను తన దేవునికి పరిచర్య చేయగలగాలి. మూడవదిగా తన విధేయత వాగ్దానం గురించి, తన చిత్తమేమి లేదు ప్రభువు చిత్తమే జరగాలని వాగ్దానం చేసింది. ఈ మూడు వాగ్దానాలలో తన శరీరము, మనసు, ఆత్మ దేవునికే అర్పితమైనాయి. ఆమె దేవుని సొత్తు, పెండ్లికియ్యబడిన వధువు. రైలులో ప్రయాణిస్తూ డార్జిలింగ్‌కు శెలవు చెప్పి కలకత్తా చేరింది. పది అడుగుల ఎత్తైన ప్రహరీ గోడ వున్న ప్రాంగణం. అదే లొరిటో ఎంటల్లీ. రెండు ఉన్నత పాఠశాలలున్న లొరిటో భవనాలు ఒక స్కూలులో 500 మంది అందరు ఉన్నతమైన కుటుంబాల నుండి వచ్చిన వారు మరో స్కూలు పిల్లలు మధ్య తరగతి నుండి పైసాలేని అనాథ పిల్లల వరకు ఉండే ఈ స్కూలులోనే సిస్టర్ తెరీసా జాగ్రఫీ, హిస్టరీ బోధించుట మొదలుపెట్టింది. ఆమె చరిత్ర పాఠాలలో ఇండియాలో క్రిస్టియన్ మత చరిత్ర అనేది ఒక భాగము. సెయింట్ థామస్ ఇండియా దేశమునకు క్రీస్తు ప్రభువు పునరుత్థానము తరువాత వచ్చి చైనా వరకు వెళ్ళి తిరిగి ఇండియా దేశంలో హతసాక్షిగా చంపబడి మైలాపూర్‌లో భూస్థాపితం చేయబడినట్లు చరిత్ర చెప్పు చున్నది. 6వ శతాబ్దంలో సిరియా క్రిస్టియన్లు కేరళ రాష్ట్రానికి వచ్చినట్లు చరిత్ర చెబుతుంది. పోర్చుగల్ దేశస్తుడైన సెయింట్ జేవియర్ 1542 సంవత్సరంలో గోవా వచ్చినట్లు ఖచ్చితంగా తెలుస్తుంది. ప్రొటెస్టంట్లు తరువాత 16వ శతాబ్ధములో బెంగాల్ వచ్చినట్లు వారు బెంగాల్ రాష్ట్రంలో స్థిరపడినట్లు ఆధారాలున్నాయి. విలియమ్‌కేరీ కష్టపడి బైబిల్ గ్రంథాన్ని ఇండియాలోని అనేక భాషలలోకి అనువదించి నట్లు చరిత్ర చెప్తుంది. 18వ శాతాబ్దం మధ్యలో మిషనరీ సేవ ఎంతో అభివృద్ధి చెందినట్లు చెప్పగలం. అదేవిధంగా 1841 ఆగష్టు 22న లొరిటో సంస్థవారు కలకత్తాలో తమ సేవ చేయుట ఆరంభించారు. అదే సంస్థలో ఆగ్నెస్ చేరి సిస్టర్ తెరీసాగా పనిచేస్తుంది. ఎంత అద్భుతము. ప్రభువు రాజ్య వ్యాప్తి తన శిష్యులకు చెప్పినట్లు సర్వలోకమునకు వెళ్ళి సర్వసృష్టికి సువార్తను ప్రకటించుట మొదలయ్యి వేగమంతమగుచున్నట్లు సిస్టర్ తెరీసా అనుకుంది. 1842 జనవరి 10వ తేదీన లొరిటో సంస్థ స్కూలు, అనాథ శరణా లయం ప్రారంభించారు. వీరి సంస్థలో విద్యనభ్యసించుట ఆనాటి భారతీయులకు అభీష్టమై యున్నది. మొదటి 20 సం॥లలో 42 మంది సిస్టర్లు చనిపోయారు. అయినను విదేశాల నుండి సిస్టర్లు సేవ చేయడానికి వస్తూనే వున్నారు. సిస్టర్ తెరీసా కూడా అదేక్రమంలో వుంది. దేవుని ప్రేమతో ఎంతటి కష్టాన్నైనా అధిగమించేవారు.

సంవత్సరానికోసారి వారి వాగ్దానంలో స్థిరపడడానికి సంవత్సరాంతపు రిట్రీటులో గడిపేవారు. 1932లో సిస్టర్ తెరీసాకు అల్బేనియా నుండి ఉత్తరం వచ్చింది. ఆమె అక్క అగాతాకి ఉద్యోగం వచ్చి లాజరు దగ్గర వుంటున్నట్లు వ్రాశారు. తల్లి ఒక్కతే స్కోప్జే నగరంలో వున్నట్లు తెలిపారు. లాజరు, అగాతా తమ తల్లికి ఎన్నోసార్లు తమ దగ్గరకు రమ్మంటే ఆమె నిరాకరించిందని తెలుసుకుని సిస్టర్ తెరీసా చాలా బాధపడింది. కాని తన తల్లి ఏనాడు ఎటువంటి విషయంలోను ఫిర్యాదు చేయలేదు గదా ఆగ్నేస్ తన విశ్వాసాన్ని కాపాడుకుంటూ ప్రభువు సేవలో కొనసాగు చున్నందుకు ఎంతో సంతోషిస్తున్నట్లు వ్రాసేవారు. 1932లో భారత స్వాతంత్ర్య ఉద్యమం ఊపందుకుంది. గాంధీ నాయకత్వంలో వేలకు వేలమంది ప్రజలు పాల్గొని ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్ళారు. కాని సిస్టర్ తెరీసాకి గాంధీగారి ఆలోచనలో ఒకటి నచ్చలేదు. అదేమంటే కుల వ్యవస్థను గాంధీగారు సమర్థించుట. ఆయన సమర్థించిన కారణమేమంటే కులవ్యవస్థ లేకుంటే భారత సాంప్రదాయం దెబ్బతింటుందని. కొండమీద ప్రసంగం గాంధీగారికి కొట్టినపిండి. ఈ విషయంలో సిస్టర్ తెరీసా గాంధీగారిని మెచ్చుకునేది.

**(సశేషం)**

# తల్లిదండ్రులారా!

బిడ్డలను ప్రేమించే తల్లిదండ్రులు, వారిని ప్రేమించే విషయంలో 'పిల్లలను మాకంటే ఎక్కువగా ఎవరూ ప్రేమించలేరు' అని చాలా గర్వంగా ఫీలవుతుంటారు. 'కన్నప్రేమ' అనేది మనుష్యులలోనే కాకుండా, పక్షులు, జంతువులలో కూడా ఉంటుంది. పక్షులైనా, జంతువులైనా వాటి పిల్లలను కాపాడుతూ, వాటికి ఆహారము సమ కూరుస్తూ ఉంటాయి. పక్షులైతే వాటి పిల్లలకు రెక్కలు వచ్చి ఎగిరే వరకువాటికి కాపలా ఉండి రక్షిస్తుంటాయి. జంతువు లైతే వాటి పిల్లలు నడవ గలిగి, పరుగెత్త గలిగే వరకు రక్షిస్తుంటాయి. ఒకవేళ మనుష్యులు వారి బిడ్డలను, వారి కాళ్ళమీద వారు నిలబడి, సంపాదించుకొని బ్రతికే వరకు వారి ఆలనాపాలనా చూసి, అదేదో ఘనకార్యంలా భావిస్తే పక్షులు, జంతువులు, మనుష్యులకు తేడా ఏముంది? పక్షులు జంతువులు ఆలోచించలేవు కాబట్టి, దేవునిచే వాటికి నిర్దేశించబడినంత వరకు మాత్రమే అవి నడుచుకుంటాయి. కానీ, మనుష్యులు ఆలోచించగలరు.తమ బిడ్డలను ఎలా పెంచాలి అన్న ఎంపిక సృష్టిలో మనుష్యులకు తప్ప మరే ఇతర ప్రాణికి లేదు. అందుకే తమ బిడ్డల విషయంలో తల్లిదండ్రులు దేవునికిలెక్క అప్పగించాల్సి ఉంటుంది. పక్షులు, జంతువులు వాటి పిల్లలకు ఆహారం సంపాదించు కోవడం మాత్రమే నేర్పిస్తాయి. మనుష్యులు కూడా వారి పిల్లలు ఉద్యోగమో, వ్యాపారమో చేసుకొని వారి కాళ్ళ మీద వాళ్ళు నిలబడాలని కోరుకోవడం తప్పు కాదు. కానీ పాపము అనేది కేవలం మనుష్యులలో ఉంటుంది కాబట్టి,వారు పాపము చేయకుండా ఉండేలా **'దేవుని భయము'** వారికి నేర్పించాలి. అలా దేవునియందలి భయభక్తులు నేర్పించక పోతే, ఉద్యోగమో, వ్యాపారమో చేసి చాలాగొప్ప వారు కావొచ్చేమో కానీ, పాపము చేయకుండా ఉండలేరు. పక్షులలో, జంతువులలో పాపమనేది లేదు. కాబట్టి, ఆజ్ఞలు, కట్టడలు, విధులు పాటించడం వాటికి వర్తించదు. మనుష్యుల మధ్యలోనే పాపము ఉంటుంది. కాబట్టి, దేవుని ఆజ్ఞలను, కట్టడలను, విధులను పాటించడమనేది మనుష్యులకే వర్తిస్తుంది. దేవుడు పదే పదే **'మీ పిల్లలకు నేర్పి, మీ పిల్లలకు నేర్పి'** అని ఎవరికి చెప్తున్నాడు? కేవలం తల్లి దండ్రులకే కదా! మరి తల్లిదండ్రులు వారికి దేవునియందలి భయభక్తులునేర్పించక, వారు చెడిపోతే, దేవుని తీర్పు వచ్చే వరకు ఈ భూమి మీద ఆ ఫలితం అనుభవించాల్సిందే. బిడ్డల ప్రవర్తన తల్లిదండ్రులకు **'నరకం'** అనిపించి నప్పుడుగానీ తెలీదు ఆ ఫలితం ఎలా ఉంటుందో. కాబట్టి తల్లిదండ్రులారా, మీ బిడ్డలనుఎంత చిన్న వయస్సు నుండి దేవునిలో పెంచగలుగుతారో, వారు పెద్దవారైనప్పుడు తమ తల్లిదండ్రులనుబట్టి అంతగా సంతోషించగలుగుతారు. తల్లి గర్భములో నుండి బయటకు వచ్చినప్పటి నుండి దేవుని మాట వినబడేలా చేయగలిగితే ఇంకా మంచిది. ఇదేదో ఛాదస్తం అనుకోమాకండి. గర్భవతిగా ఉన్న మరియమ్మ, ఎలీసబెతుని చూడటానికి వెళ్ళినప్పుడు, నెలలు నిండిన ఎలీసబెతు గర్భములోని శిశువు (యోహాను) గంతులు వేసెనని వ్రాయబడి వుంది.*"ఎలీసబెతు మరియ యొక్క వందన వచనము వినగానే, ఆమె గర్భములో శిశువు గంతులు వేసెను" (లూకా 1:41).* అప్పుడేపుట్టిన బిడ్డలు చూడక పోవచ్చు, మాట్లాడక పోవచ్చుకానీ, వినగలరు. కాబట్టి, మీపిల్లలు పసిపిల్లలుగా ఉన్నప్పుడే వారికి దేవున్ని పరిచయం చేయండి. అది మీ బాధ్యత అని గుర్తు పెట్టుకోండి.

టీ.వి.లో వచ్చే పిల్లల ప్రోగ్రామ్స్‌లో చాలా చిన్నపిల్లలు, అంటే 5 సం॥ల లోపు పిల్లలు కూడా అసమాన ప్రతిభ చూపిస్తుంటారు. పెద్దవాళ్ళలాగా స్టెప్స్ వేస్తూ డాన్స్ చేస్తుంటారు. పాటలు పాడిస్తుంటారు, ఇంకా అనేక రకాల కార్యక్రమాలు చేయిస్తుంటారు. మరి అంత చిన్నవయస్సులో గొప్ప ప్రతిభ చూపించడానికి కారణం ఎవరు? తల్లిదండ్రులే కదా! క్రైస్తవ కుటుంబాలలో సైతం ఈ సంస్కృతి లేకుండా పోలేదు. చర్చి ప్రోగ్రామ్స్‌లో వారి పిల్లలతో డాన్స్ చేయించ డానికి తల్లిదండ్రులు ఉత్సాహం చూపించడమే కాకుండా, ఎలా డాన్స్ చేయాలో కూడా నేర్పిస్తారు. వారి పిల్లలు స్కూల్లో

ఫస్ట్ రావడం కోసం అహర్నిశలు కష్టపడతారు. ఇందులో తప్పేముంది అన్న సంగతి ప్రక్కన పెడితే, పిల్లలకు ఆధ్యాత్మికంగా ఎలాంటి ఉపయోగంలేని ఈ లోక విషయాలలో తర్ఫీదు ఇవ్వడానికి అత్యుత్సాహం చూపించే తల్లిదండ్రులు, దేవుని విషయాలు నేర్పడానికి ఎందుకు ఉత్సాహం చూపించరు? ఇంగ్లీషుకానీ, తెలుగు కాని చదవగలిగే పిల్లలతో బైబిలును పూర్తిగా (ఆదికాండము నుండి ప్రకటన గ్రంథము వరకు) చదివించాలి అనే ఆలోచన కూడా ఎందుకు రావడం లేదు. అదేమన్నా అసాధ్యమైన పనా? 99% క్రైస్తవులలో పెద్దవాళ్ళు కూడా చేయలేని పని (బైబిలు పూర్తిగా చదవడం) మీ పిల్లలతో చేయించడం మీకు గర్వకారణం కాదా? స్టేజీ మీద స్టెప్పులు వేయిస్తే, 'భలే డాన్స్ చేసారు' అని పొగుడుతారు, కాబట్టి మీ బిడ్డలనుబట్టి గర్వంగా ఫీలవుతారు. మీ బిడ్డలు బైబిలు పూర్తిగా చదివిన విషయం పదిమందికి తెలియకపోవడం వలన మీకు ఘనత రాదు కాబట్టి మీకు ఆసక్తి ఉండదు. మీ ఘనత కోసం బిడ్డలను ఉపయోగించుకోవడం స్వార్థం కాదా? *'మనుష్యులలో ఘనముగా ఎంచబడునది దేవుని దృష్టికి అసహ్యము' (లూకా 16:15).* మీ బిడ్డలను దేవునిలో పెంచితే దేవుని నామము ఘనపరచబడుతుంది. లేదంటే మనుష్యులలో మాత్రమే ఘనముగా ఉండి, దేవుని దృష్టికి అసహ్యులవుతారు. పిల్లలను సండేస్కూలు పంపించి కంఠత వాక్యాలు నేర్పించినంత మాత్రాన సరిపోదు. ఎందుకంటే, *"యెహోవా గ్రంథమును పరిశీలించు చదువుకొనుడి" (యెషయా 34:16)* అని వ్రాయబడిన ప్రకారం, నాలుగు కంఠత వాక్యాలు తెలిస్తేనో, అప్పుడప్పుడు అవసరమైన వాక్యము చదివితేనో బైబిలును పరిశీలించి చదివినట్లు కాదు. బైబిలును ఆదికాండము 1వ అధ్యాయము మొదలుకొని ప్రకటన 22వ అధ్యాయం వరకు ప్రతి అధ్యాయాన్ని, వచనాన్ని పరిశీలనగా చదివితేనే పరిశీలించినట్లు. ఈ ప్రక్రియని మీ బిడ్డలతో ప్రారంభించి, బైబిలు పూర్తిగా చదివించి దేవుని ముందు గర్వంగా ఫీలవ్వచ్చు కదా. దేవుడు బైబిలును మానవాళికి ఇచ్చింది, వారు క్రమములో నడవడానికి. పిల్లలతో బైబిలును క్రమముగా చదివించడం వలనవారు దేవుని మార్గంలో నడుస్తారు. *"బాలుడు నడువవలసిన త్రోవను వానికి నేర్పుము,వాడు పెద్దవాడైనప్పుడు దానినుండి తొలగిపోడు" (సామెతలు 22:6)* అని బైబిలు చేప్పే సత్యాన్ని క్రైస్తవులు పాటించడం లేదు. అన్యులు వారి మత గ్రంథాలను పిల్లలతో చదివించినట్లు, క్రైస్తవులు వారి పిల్లలతో బైబిలును చదివించడం లేదు. పిల్లలకు ఎలాంటి బరువు బాధ్యతలు, బాధలు ఉండకపోవడం వలన వారికి సహజంగానే సంగ్రహశక్తి ఎక్కువగా ఉంటుంది. కాబట్టి వారు పిల్లలుగా ఉన్నప్పుడే వారితో బైబిలు పుర్తిగా చదివించడానికి పూనుకోండి. **ఇది దేవుని చిత్తమై యున్నది.**

**(సశేషం)**


# ఇంటర్నెట్‌లో తెలుగు బైబిల్

**మీరు ఎక్కడున్నా సరే, మీ స్మార్ట్ ఫోన్, ల్యాప్‌టాప్, డెస్క్‌టాప్‌లలో తెలుగు బైబిల్ చూడవచ్చును. అంతేకాక తెలుగు–ఇంగ్లీషు ప్యారలల్ బైబిల్, తెలుగు ఆడియో బైబిల్, తెలుగు బైబిల్ ఎన్‌సైక్లోపీడియా, తెలుగు ఆడియో, వీడియో పాటలు, తెలుగు పాటల రచనలు, అద్భుత సాక్ష్యములు, బైబిల్ వాల్‌పేపర్స్, తెలుగు క్రైస్తవ పుస్తకములు ఇంకా మరెన్నో మీ కోసం... నేడే దర్శించండి...**

**www.onlinetelugubible.net**

# బుద్ధిహీనులు ఎవరు?

'హన్నాకృప' పాఠకులకు, మన ప్రభువైన యేసుక్రీస్తు నామమున మీకందరికి నా శుభములు.

దేవుని చిత్తము చేయుటకు మనిషికున్న బుద్ధి చాలదు. ఇది గ్రహించిన మహాజ్ఞాని అయిన సొలొమోను, దేవుని ఈలాగు ప్రార్థించాడు, "నాకున్న బుద్ధి చాలదు వివేకముగల హృదయము దయచేయుము". కావున ప్రతి మనిషి తనలోని బుద్ధిహీనతను గుర్తించి దేవుని ప్రార్థించి బుద్ధిని పొందవలెను. "నీ చేతులు నన్ను నిర్మించి నాకు రూపు ఏర్పరచెను నేను నీ ఆజ్ఞలను నేర్చుకోనునట్లు నాకు బుద్ధి దయచేయుము" (కీర్తనలు 119:73). తమ దృష్టికి తాము జ్ఞానులనియు తమ యెన్నికలో తాము బుద్ధిమంతులనియు తలంచుకొను వారికి శ్రమ" (యెషయా 5:21) అని వ్రాయబడినది. అందుకే నీ స్వబుద్ధిని ఆధారము చేసికొనవద్దని వ్రాయబడినది. "నీ స్వబుద్ధిని ఆధారము చేసికొనక నీ పూర్ణ హృదయముతో యెహోవాయందు నమ్మకముంచుము" (సామెతలు 3:5).

ఎవరు బుద్ధిహీనులు, బుద్ధిలేనివారు అని వాక్యము చెప్పుచున్నదో తెలుసా?

1) **"అంతరంగమున పగ ఉంచుకొనువాడు అబద్ధికుడు. కొండెము ప్రచురము చేయువాడు బుద్ధిహీనుడు"** (సామెతలు 10:18). కొండెములు చెప్పుచూ కొండంత ఆనందం పొందేవారు ప్రపంచంలో ఎంతోమంది వున్నారు. అయితే వారందరు బుద్ధిహీనులు అని వ్రాయబడినది.

2) **"వ్యర్థమైన వాటిని అనుసరించువాడు బుద్దిలేనివాడు".** తన భూమిని సేద్యపరచుకొనువానికి ఆహారము సమృద్ధిగా కలుగును, వ్యర్థమైనవాటిని అనుసరించువాడు బుద్ధి లేనివాడు". (సామెతలు 12:11). మనుష్యులు ఎన్ని వ్యర్థమైన విషయాలను అనుసరిస్తూ, చూస్తూ తమ సమయాన్ని, డబ్బును వ్యర్థము చేస్తూ ఎంజాయ్ చేస్తున్నామని అనుకుంటూ ఉంటారు. ఒక వ్యక్తి వ్యర్థమైన విషయాలను అనుసరిస్తూ ఉన్నాడంటే ముఖ్యమైన విషయాలను చేయలేకపోతున్నాడని గ్రహించాలి. బైబిలు గ్రంథంలో బుద్ధిలేని కన్యకలు వ్యర్థమైన వాటికి సమయమిచ్చుట వలన అవసరమైన ముఖ్యమైన నూనెను తీసుకొని పోలేకపోయారు. అందుకే పెండ్లి విందుకు పోలేకపోయారు. ఒకవేళ నీవు వ్యర్థమైన విషయాలను అనుసరిస్తూ ఉంటే, చూస్తూ ఉంటే అది బుద్ధిహీనత అని గ్రహించి పశ్చాత్తాపముతో ప్రభువును ప్రార్థించాలి.

3) **"తన మనస్సును నమ్ముకొనువాడు బుద్ధిహీనుడు".** "తన మనస్సును నమ్ముకొనువాడు బుద్ధిహీనుడు జ్ఞానముగా ప్రవర్తించువాడు తప్పించుకొనును" (సామెతలు 28:26). దేవుని వాక్యమును కాకుండా తన మనస్సును నమ్ముకొను వాడు బుద్ధిహీనుడు అని బైబిలు చెప్పుచున్నది. చాలామంది యొక్క మనస్తత్వం ఎలా ఉంటుందంటే, అది నాకు ఇష్టము లేదు కాబట్టి నేను చేయను, ఇది నా మనస్సుకు నచ్చినది కాబట్టి ఇది చేస్తాను అని అనుకుంటారు. కాని దేవుని వాక్యాన్ని నీవు పక్కన పెట్టి నీ మనస్సును నీవు నమ్మితే, నీవు బుద్ధిహీనుడువు నీవు బుద్ధిహీనురాలవు.. ఒకవేళ నీవు నీ మనస్సును నమ్ముకొని వుంటే అది బుద్ధిహీనత అని గ్రహించి పశ్చాత్తాపముతో ప్రభువును ప్రార్థించాలి.

4) **"బుద్ధిహీనులు విస్తారముగా మాటలాడుదురు"** (ప్రసంగి 10:14). ఎవరైతే అనవసరంగా మాటలాడతారో వాళ్ళందరూ బుద్ధిహీనులు అవుతారు. కాబట్టి మన మాటలు ఉప్పు వేసినట్టుగా మితముగా వుండాలి."

5) **"దేవుడు లేడని బుద్ధిహీనులు తమ హృదయములో అనుకొందురు వారు చెడిపోయినవారు అసహ్యకార్యములు చేయుదురు. మేలుచేయు వాడొకడును లేడు"** (కీర్తనలు 14:1). చాలాసార్లు విశ్వాసి అయిన నీవు దేవుని నమ్ముకొని, మారుమనస్సు పొంది, బాప్తిస్మము తీసుకొని 'దేవుడు వున్నాడా? దేవుడు ఉంటే నాకెందుకు ఈ పరిస్థితి, నాకెందుకు ఇలా జరిగింది' అని అనుకోవడం బుద్ధిహీనత, కాబట్టి దేవున్ని ప్రశ్నించడం అంటే అది బుద్ధిహీనత అని గ్రహించాలి. కాబట్టి నా ప్రియ సోదరీసోదలారా, విశ్వాసులారా దేవుడు అను గ్రహించు బుద్ధిని సంపాదించి బుద్ధిహీనులము కాకుందము గాక! ఆమేన్!!

**–ఇట్లు డా॥ సుష్మ ప్రశాంత్, నెల్లూరు**

స్త్రీల విభాగం

# నా కుటుంబము



**భార్య, భర్త, పిల్లలు కలిసి ఒకే చోట ఉంటే దానిని కుటుంబము అంటారు. పిల్లలు ఉన్నా లేకపోయినా భార్యా భర్తలు కలిసి జీవిస్తున్నా కుటుంబమనే అంటారు. కుటుంబ వ్యవస్థ అనేది దేవుని ప్రణాళికలో భాగమే. కుటుంబ వ్యవస్థలో స్త్రీ ప్రధాన భూమిక పోషిస్తుంది.**

---

"యధార్థవర్తనుడగు నీతిమంతుని పిల్లలు వాని తదనంతరము ధన్యులగుదురు" అను దేవుని వాగ్దాన ప్రకారం వారి పిల్లలందరు ధన్యులైనారు. చాలాకాలం పిల్లలు లేకయుండిన జొర్యా పట్టణస్థుడైన మానోహ తనకు మగబిడ్డ పుడతాడని తన భార్య తనతో చెప్పినప్పుడు వెంటనే ఆ బిడ్డను ఎలా పెంచాలి, ఏమి చెయ్యాలన్న ఆలోచనలతో సంతోషింపక, నా ప్రభువా! నీవు పంపిన దైవజనుడు మరల మా యొద్దకు వచ్చి, పుట్టబోవు ఆ బిడ్డకు మేము ఏమేమి చెయ్యవలెనో దానిని మాకు నేర్పునట్లు దయచేయుము అని ప్రార్ధించాడు.

యాజకుడైన ఏలీకి ప్రార్ధనా జీవితం లేదు. అతను ఎన్నడూ తన కుటుంబం కొరకు దేవుని సన్నిధిలో ప్రార్ధించలేదు. అందువలన తన ఆత్మను యెహోవా సన్నిధిలో కుమ్మరించుకొనుచున్న హన్నాను మత్తురాలనుకున్నాడు. దేవుడు ఏలీతో అతని కుమారుల విషయం హెచ్చరించినప్పుడు అతను తన కుమారులతో మాట్లాడాడు కాని మందలించలేదు. మరి ముఖ్యంగా తన బిడ్డల మనసులు మార్చమని దేవునికి మొఱ్ఱపెట్టలేదు. మొఱ్ఱపెడితే దేవుడు హొఫ్నీ, ఫీనేహాసుల హృదయాలను మార్చియుండేవాడేమో! చాలా మంది తల్లిదండ్రులు దారి తప్పిన తమ బిడ్డల విషయం పాస్టర్లను, సువార్తికులను ప్రార్థించమని అడుగుతుంటారు. ఇది సహజం.


ఒకనాడు ఒక తల్లితో ఆమె కుమార్తెలిద్దరు దుర్వ్యసనాలకు బానిసైన తమ సహోదరుని అతని పుట్టిన రోజున తను మారిపోతానని ప్రమాణం చేయించుకోమని బలవంతం చేస్తున్నారు. ఆ తల్లి "అమ్మా! మీ అన్న కొరకు నేను ప్రభువును ప్రార్థిస్తున్నాను. ప్రమాణాలు, పశ్చాత్తాపాలు మనిషిని మార్చవు. ప్రమాణం నిలుపుకోలేరు. కురువిందము లైన హృదయాలను మార్చగలిగే శక్తి ఆ ప్రభువుకే ఉన్నది. మీరు కూడ మీ అన్న కొరకు ప్రార్ధన చేయండి" అంది. ఆ తల్లి చనిపోయిన పదిహేను సంవత్సరాలకు ఆమె కుమారుడు గొప్ప దైవజనుడైనాడు.

బైబిలు గ్రంథమంతటిలో దేవుడు కుటుంబమును ఏర్పాటు చేసిన నాటనుండి ప్రతి కుటుంబం ఆశీర్వదింపబడుటకు ఆ ఇంటి యజమాని కారకుడగుచున్నాడు. బైబిలు గ్రంథములోనేకాక మన చుట్టుప్రక్కల నివశించే కుటుంబీకులనందరిని మనము ఎరిగేయున్నాము. మనం ఒంటరిగా ఉన్నప్పుడు మన చుట్టు వుండే క్రైస్తవ కుటుంబాల పితరులను గురించి తెలుసుకోవడం ఆలోచించటం ప్రారంభిస్తే ఇప్పుడు హెచ్చింపబడియున్న వారందరి (ధనములో కాక) సంతానం, ఆత్మీయత హెచ్చుగా ఉండటానికి వారి పితరులే కారణము. అంటే పితరుల కుటుంబాలు.

యిర్మీయా గ్రంథము 35వ అధ్యాయంలో దేవుడైన యెహోవా యిర్మీయాని రేకాబీయుల యొద్దకు పొమ్మని, పోయి వారి సంతానంలో ఎవరితోనైనా ద్రాక్షారసం త్రాగించమంటాడు. యిర్మీయా రేకాబీయులలో కొందరిని రహస్య స్థలములో చేర్చి ద్రాక్షారసం త్రాగమని ద్రాక్షారసం పాత్రలు వారికిస్తే, వారు మా పితరుడగు రేకాబు కుమారుడైన యెహోనాదాబు మీరైనను మీ సంతానం వారైనను ఎప్పుడును ద్రాక్షారసము త్రాగకూడదని మాకాజ్ఞాపించెను గనుక మేము త్రాగమన్నారు. అందుకుగాను దేవుడైన యెహోవా 19వ వచనంలో "కాబట్టి ఇశ్రాయేలు దేవుడును సైన్యములకు అధిపతియగు యెహోవా నా సన్నిధిలో నిలచుటకు రేకాబు కుమారుడైన యెహోనాదాబునకు సంతతివాడు ఎన్నడును ఉండక మానడు" అని సెలవిచ్చాడు. ఒక వ్యక్తి యెహోనాదాబు ద్వారా అతని కుటుంబాలకు ఎన్నటెన్నటికి నిలిచివుండే దీవెన కలిగింది. **(సశేషం)**

## ఈ నెల ప్రశ్న - ఆగష్టు-2025

**మోషే తల్లియైన యోకెబెదు**
**తండ్రి పేరు ఏమిటి?** (సంఖ్యాకాండము)




మీ జవాబు (రెఫరెన్సుతో సహా) ఈ నెల 15వ తేదీలోపు 9440217726 నంబరుకి వాట్సాప్ ద్వారా మాత్రమే పంపించాలి. సరైన సమాధానం పంపిన వారిలో **'లక్కిడిప్'** ద్వారా ఒకరిని ఎంపిక చేసి వారికి రూ.250/-లు విలువ చేసే **'అపొస్తలుడు'** అనే పుస్తకం బహుమతిగా ఇవ్వబడుతుంది. అయితే ఈ అవకాశం కేవలం **'చందాదారులకు మాత్రమే'**. అనగా చందా చెల్లించిన వారు (చందాదారుల పట్టికలో పేరు ఉన్నవారు) ఈ ప్రశ్నకు జవాబు పంపించాలి. 15వ తేది లోపు చందా చెల్లించేవారు కూడా పాల్గొనవచ్చును. ఈ క్రింది బాక్సులో జవాబు, మీ పేరు, బుక్ సీరియల్ నంబరు వేసి ఫోటో తీసి వాట్సాప్ ద్వారా పంపించాలి. పేరు, సీరియల్ నంబరు లేకపోతే వారి పేరు లక్కిడిప్‌లో చేర్చబడదు.

జవాబు.........................................................

పేరు.............................................................

గ్రామము................బుక్ సీరియల్ నంబరు...........

**జూలై-2025 ప్రశ్న జవాబు :**
**ఉజ్జీయేలు (లేవీయకాండము 10:4)**

**జవాబులు పంపినవారు :**

1. బి. సరోజిని-గుంతకల్లు, 2. వై. జయజోసఫ్-భీమవరం, 3. టి. క్రిస్టియానమ్మ-నందికొట్కూరు, 4. వై. సంధ్యారాణి -ఒంగోలు, 5. జి. దేవదాసు-నంద్యాల 6. జి. శిరోమణి-వేల్పూరు, 7. ఆర్. జయమ్మలాబాను-గుంతకల్లు

### చందాదారుల వివరములు

| | | |
|---|---|---|
| కర్మేల్ హెల్త్‌కేర్, పులివెందుల | (08-07-25) | 5000 |
| డా॥ బి. ప్రజ్వలిత్ రూబేన్, హన్మకొండ | (12-10-24) | 5000 |
| రెవ.డా॥ వి. విజయకుమార్, బొబ్బిలి | (15-01-24) | 5000 |
| రావెల ప్రసాదరావు, గుంతకల్లు | (21-06-24) | 5000 |
| మేరిసలోమి, సిరివెళ్ళ, కర్నూలుజిల్లా | (29-11-22) | 5000 |
| బి. ప్రభువరకుమార్, రామన్నపేట | (24-06-25) | 3000 |
| కె. రజిని, నరసరావుపేట | (15-06-25) | 3000 |
| డా॥ క్రిస్టియన్ సిరప్ప, అనంతపూర్ | (06-07-24) | 3000 |
| యు. అనిత, సిరివెళ్ళ | (06-12-24) | 3000 |
| పి. జయదేవి, గుంటూరు | (03-07-25) | 2000 |
| వై. సంధ్యారాణి, ఒంగోలు | (04-01-25) | 2000 |
| పి.వి.కెరోలిన్, గుంటూరు | (11-12-24) | 2000 |
| డా॥ సిహెచ్‌కె. సుష్మప్రశాంత్, నెల్లూరు | (22-01-24) | 1500 |
| రావెల ప్రసాదరావు, గుంతకల్లు | (27-03-25) | 1000 |
| జి.మాణిక్యమ్మ అనంతపురం | (25-03-24) | 1000 |
| శ్రీమతి రూతు హోసన్న, కావలి | (09-11-24) | 1000 |
| జి. కమలాకర్, ఒంగోలు | (03-03-25) | 1000 |
| ఆర్. జయమ్మలాబాను, గుంతకల్లు | (16-07-25) | 500 |
| జి. జార్జిథామస్, దుగ్గిరాల | (12-03-25) | 500 |
| కె. ప్రకాశరావు, నరసరావుపేట | (14-01-25) | 500 |
| బి. నెహెమ్యా, చిన్నగంజాం | (25-12-24) | 500 |
| డి. నాగేశ్వరరావు, సంతరావూరు | (10-11-24) | 500 |
| కె. కమల్, మంచిర్యాల, తెలంగాణ | (14-10-24) | 500 |
| యం. విల్సన్, నెల్లూరు | (14-09-24) | 500 |
| కె. ఆదిలక్ష్మి, డిస్ట్రిక్ట్ లైబ్రరి, ఒంగోలు | (24-09-24) | 500 |
| కె. ఐజక్‌సుకుమార్, ఒంగోలు | (14-08-24) | 500 |
| ఆర్. దేవికుమారి, పర్చూరు | (20-05-24) | 500 |
| డి. శ్యామ్‌సిన్హా, బాపట్ల | (13-12-23) | 500 |
| బి. పరంజ్యోతి, హైదరాబాద్ | (11-12-23) | 500 |
| మారనాత బైబిల్ సెమినరీ, విజయవాడ | (24-11-23) | 500 |
| బి. సరోజిని, గుంతకల్లు | (06-05-25) | 400 |
| జి. రవి, వేల్పూరు | (12-07-25) | 350 |
| స్వయంప్రభ, చిలకలూరిపేట | (14-06-25) | 350 |
| యస్. రాజశేఖర్, కర్నూలు | (04-06-25) | 350 |
| జి. దేవదాసు, నంద్యాల | (05-04-25) | 350 |
| జి. కళావతి జాకబ్, ఒంగోలు | (03-04-25) | 350 |
| ఆర్.ఆర్.కె.పీటర్-విశాఖపట్నం | (23-03-25) | 350 |
| పి. జాన్‌బాబు-గోపాలపురం | (21-03-25) | 350 |
| ఎ. ప్రభుచరణ్-జగిత్యాల | (19-03-25) | 350 |
| పి. నీలిమారాజారత్నం, ఉయ్యూరు | (14-03-25) | 350 |
| యస్. గోపి, పార్వతిపురం | (17-12-24) | 350 |
| బి. రవికుమార్, హైదరాబాద్ | (20-11-24) | 350 |
| బి. జయరావు, బుచ్చిరెడ్డిపాలెం | (06-11-24) | 500 |
| వి. రత్నమ్మ, హైదరాబాద్ | (17-10-24) | 350 |
| జి. క్యాథరిన్, ఒంగోలు | (08-10-24) | 350 |
| వై. జోసఫ్, భీమవరం | (04-10-24) | 350 |
| కె. రాబర్ట్ ప్రభాకర్, ఉదయగిరి | (03-10-24) | 350 |
| టి. క్రిస్టియానమ్మ, నందికొట్కూరు | (12-09-24) | 350 |
| సిహెచ్. శైలజ, విజయవాడ | (04-04-25) | 200 |

**చిన్నపిల్లల పేజి**

# అవిశ్వాసము

విక్కి ముఖంలో ఒక తెలియని ఉత్సాహం. తెలియని కంగారు. హడావిడిగా రెడీ అవుతున్నాడు. అసలు విషయమేమిటంటే విక్కీకి పర్వతారోహణం అంటే చాలా ఇష్టం ఎన్నెన్నో పర్వతాలను అధిరోహించి అనేక రికార్డులను సృష్టించాడు. బహుమతులను పొందుకున్నాడు. తాను అధిరోహించాలనుకున్న వాటిలో ఇంకా ఒకే ఒక పర్వతం మిగిలిపోయింది. దానిని అధిరోహించడానికి సంసిద్ధమౌతున్నాడు. అందుకే ఆ ఉత్సుకత.

విక్కి తాను అధిరోహించబోయే పర్వతం వద్దకు వెళ్ళాడు. ప్రార్థనతో తన ప్రయాణం ప్రారంభించి నడుముకు తాడు కట్టుకొని, తాడు ఇంకొక చివరను పర్వతంపై లంగరుతో సంధించి, లంగరు సరియైన స్థానంలో పడిందో లేదో తాడును లాగి చూసుకొని దేవున్ని తలచుకొని తన ప్రయాణాన్ని ప్రారంభించాడు. ఎక్కడా ఆగకుండా పర్వతాన్ని ఎక్కసాగాడు విక్కి. కొండపైన చల్లటిగాలి వీస్తుంది. వేడిని పుట్టించే బట్టలు, చేతులకు కాళ్ళకు ఉన్ని గ్లౌజులు, సాక్సులు, ట్రెక్కింగ్ షూస్ ధరించి అన్ని విధాల సన్నద్ధమ్మైన విక్కి చల్లటి గాలులను లెక్కచేయకుండా ఎక్కసాగాడు. కొంత దూరం ప్రయాణించేసరికి చీకటి పడసాగింది, చీకటి, చలిగాలులు ఇబ్బంది పెడుతున్న ఆగకుండా అలానే రాత్రంతా ప్రయాణించాడు ఎలాగైన సరే శిఖరం చివరికి చేరాలనే ధృఢనిశ్చయంతో.

చీకటి కారణంగా అనుకున్న మార్గం నుండి కాస్త తప్పిపోయినట్టు అనుమానం కలిగినా మొండిగా అలానే ముందుకు సాగాడు. ఏదో విధంగా శిఖరం చివరి అంచుకు చేరి విజయానందంతో పెద్దగా అరవసాగాడు. ఇంతలో అతని కాలు పట్టు తప్పి జారింది. అమాంతం శిఖరం చివరి నుండి క్రిందకు పడిపోసాగాడు. చుట్టూ చీకటి ఏమి చేయాలో తెలియక హెల్ప్‌మి గాడ్, హెల్ప్‌మి అంటూ సహాయం కోసం అర్థించసాగాడు. తన జీవితం ముగిసి పోయింది అనుకున్నాడు. సహాయం కోసం ప్రార్థిస్తుండగ, క్రిందకు పడే తన ప్రయాణం ఆగిపోయింది. తను నడుముకు కట్టుకున్న తాడు వలన గాలిలో వ్రేలాడుతూ ఉండిపోయాడు. కాస్త ఊపిరి పీల్చుకున్నప్పటికి, చలికి వణుకుతూ, చుట్టూ ఉన్న చీకటిలో ఏమి కనబడక, ప్రాణాలు ఎలా రక్షించుకోవాలో తెలియక దేవుడా సహాయం చేయి అని పెద్దగా ఏడుస్తూ ప్రార్థించసాగాడు. నిజంగా నా సహాయం కావాలా?అని ఒక స్వరం వినబడింది విక్కికి. నా పరిస్థితి చూసి అడుగుతున్నావా? ఈ సమయంలో నీవు తప్ప నాకు సహాయం చేసే వేరెవ్వరూ లేరు ప్రభువా అన్నాడు దీనంగా. నిజంగా నేను నీకు సహాయపడగలను అని నీవు నన్ను విశ్వసిస్తే నేను చెప్పింది చేయాలి అన్నాడు దేవుడు. నువ్వు ఏమి చెప్పినా చేస్తాను అన్నాడు విక్కి. అయితే నీ నడుముకు ఉన్న తాడును తీసివేయి అన్నాడు దేవుడు. మౌనంగా ఉండిపోయాడు విక్కి. ఆ తాడు వలననే కదా ప్రాణాలతో ఉన్నాను, దానిని తీసేస్తే క్రింద పడి చస్తాను కదా అని ఆలోచిస్తూ, తాడును మరింత గట్టిగా పట్టుకొని అలాగే వ్రేలాడసాగాడు.

మరునాడు ప్రొద్దునే ఒక అంబులెన్స్ వచ్చి నేల నుండి 3 అడుగుల ఎత్తులో వ్రేలాడుతూ, మంచు వలన బిక్కచచ్చి పోయి ఉన్న విక్కి శవాన్ని వాహనంలో ఎక్కించారు. దేవుని పై విశ్వాసం ఉంచి త్రాడు తీసివేసుంటే విక్కీ ప్రాణాలతో ఉండేవాడు.

విక్కి సహాయం చేయమని దేవుని అర్థించాడే కానీ దేవుడు సహాయం చేస్తున్నాడని గ్రహించలేకపోయాడు. దేవుడు సహాయం చేస్తాడని నమ్మలేకపోయాడు. ఫలితంగా ప్రాణాలే కోల్పోయాడు.

"విశ్వాసము లేకుండ దేవునికి ఇష్టుడైయుండుట అసాధ్యము" (హెబ్రీ 11:6).

**(8వ పేజీ తరువాయి...)**

ఆటల పోటీలు జరుగుచుండెను. రోమా సామ్రాజ్య చిహ్నమైన గ్రద్ద యొక్క ప్రతిమను దేవాలయపు ద్వారము యొద్ద నిలిపెను. చివరకు ఎంతగా దిగజారాడంటే పాలరాతితో చక్రవర్తి కొరకై ఆయనే దేవునిగా ఆగస్టస్ సీజరుకు ఒక దేవాలయము కట్టించాడు.

ఈ విగ్రహారాధనను అరికట్టుటకై పదిమంది యూదా యోధులు కలసి హేరోదును ఆ దేవాలయములోనే చంపుటకు ప్రతిన పూనినారు. కాని ఈ కుట్రను ముందుగానే తెలిసికొనిన హేరోదు వారిని బంధించి అతి చిత్రమైన హింసలకు గురిచేసి చంపివేశాడు. ఈ కార్యములన్నీ కప్పిపుచ్చుకొని యూదుల మెప్పు పొందుటకై అయిదు శతాబ్దముల నుండి శిథిలమైపోయిన దేవాలయమును తిరిగి నిర్మించుటకు క్రీ.పూ. 17లో ఏర్పాట్లు గావించాడు. అందుకు రెండు సంవత్సరములు కావలసిన సామాగ్రిని సమకూర్చాడు. తొమ్మిదిన్నర సంవత్సరములు పూర్తి అయిన దేవాలయములో దైవకార్యక్రమములు మొదలైన తర్వాత అనేక సంవత్సరములు అనేక మంది నగిషీ పని వారిచే మన రక్షకుని కాలములో కూడ అది కట్టబడుచూనే యుండెను.

గెస్సియన్ ఫ్లోరా యూదయకు గవర్నరుగా నియమితుడైన తర్వాత పద్దెమిది వేలమంది పనివారిని దేవాలయ పని నుండి తొలగిస్తే, వారు సంపాదన లేక, ఉద్యోగము లేక, తిరుగు బాటుదారులై అక్రమములు సాగించుచూ క్రీ.శ.70 సం॥లో ఆ దేవాలయ నాశనమునకు పాత్రులైరి.

ఇంతవరకు నెహెమ్యా కాలము నుండి క్రొత్త నిబంధన ప్రారంభము వరకు క్రీస్తురాకడ వరకును సృష్టి ఆరంభము నుండి 4000 సం॥ల చరిత్ర పూర్తి అగుచున్నది.

అగస్టస్ సీజరు (కైసరౌగుస్తు) పరిపాలనలో ప్రపంచము శాంతి సమాధానములు కలిగియుండెను. మత్తయి 24:31లో ప్రభువు చెప్పిన విధముగా దేవాలయము పడగొట్టబడిన తర్వాత యూదులు చెదరగొట్టబడి 1948లో ఇశ్రాయేలు స్వరాజ్యము స్థాపించుకొను వరకు ప్రవాసములో ఉన్నారు.

**(సమాప్తం)**

## బైబిల్ పద వినోదము-7 జవాబులు

| | | | | | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| మో | అ | దె | బో | రా | హి | అ | ప | ని | యో | డు | కా | లు | వి | రి |
| శి | రీ | బా | ల | లు | త్రీ | మ | ము | త్య | బా | రే | జ | అ | బ్కా | స |
| ప | హే | యా | జ | ర | యు | ర | ర | దే | వు | త | బె | యే | ర్షె | బా |
| రి | జ | తు | ట | హె | లు | ఐ | గా | వు | లు | వా | గ్దా | న | ము | దా |
| శో | ఏ | శా | వు | బో | ఒం | శి | బం | డు | అ | హు | జ | తు | ది | మ |
| ధిం | అ | గొ | షే | తు | టె | క్ష | అ | మ | నో | వే | ద | న | అ | డి |
| చు | న | ద్రా | మై | బ | లు | అ | ఇ | స్సా | కు | అ | ర | ణ్య | ము | మె |
| ట | న | లు | అ | యా | కో | బు | వే | ల | అ | ము | రా | న | ద్ద | ప |
| అ | తృ | ణీ | క | రిం | చు | ట | ట | సా | ధు | వు | కీ | డు | శి | అ |
| గొ | ద | హ | న | బ | లి | ట | గా | అ | ప్ర | జ్యే | ష్ఠ | త్వ | ము | త్నా |
| త్తై | ము | అ | ఎ | దో | ము | వం | డు | అ | యా | అ | బ | యు | డ | ము |
| పి | ల | అ | క | రు | వు | ర | లు | కు | ఐ | బా | లి | హూ | అ | ఐ |
| ల్లి | ఫ | క | ర | ణ్య | ము | గూ | యే | శె | ము | శె | పీ | దీ | అ | మా |
| అ | స | లా | బా | ను | అ | ల | తూ | ఏ | అ | మ | ర | తు | మి | ప్ర |
| సి | రి | యా | బే | యే | రీ | క | బె | అ | వ | తు | ము | అ | గ | ల్కా |

**జవాబులు పంపినవారు :**

1. బి. ప్రభువరకుమార్ –రామన్నపేట, 2. బి. ప్రేమలత–నెల్లూరు, 3. బి. నెహెమ్యా–చిన్నగంజాం 4. పి. విజయ కుమారి–ఒంగోలు, 5. యన్. భాగ్యమ్మ– చీరాల, 6. కె. లలితాభాగ్యం–కనిగిరి, 7. యం. స్వయంప్రభ –చిలకలూరిపేట, 8. టి. క్రిస్టియానమ్మ–నందికొట్కూరు, 9. జి. మేరి కేథరిన్–ఒంగోలు, 10. వై. జయజోసఫ్–భీమవరం, 11. పి. ప్రభుకుమార్–ఒంగోలు, 12. బి. సరోజిని– గుంతకల్లు, 13. వై. సంధ్యారాణి –ఒంగోలు, 14. యం. రాజు–ముగతి, 15. జి.శిరోమణి–వేల్పూరు, 16. యేసురత్నం–ఒంగోలు, 17. కె. మార్టిన్ మధుచరణ్ –పులివెందుల,18. జి. దేవదాసు–నంద్యాల, 19. యస్. జాన్‌బాబు–ఒంగోలు, 20. జి. శిరోమణి– వేల్పూరు, 21. ఆర్. జయమ్మలాబాను–గుంతకల్లు


**సండేస్కూల్/V.B.S. బుక్స్**

**మరియు గేమ్స్ కొరకు**

**ఫోన్: 9440217726**

# బైబిల్ పద వినోదం - 08

## యాకోబు

ఈ క్రింది పదాలను ప్రక్కనున్న అక్షరాలలో వెదకండి. పదాలు అడ్డంగా, నిలువుగా, క్రాస్‌గా ఉండవచ్చు, కానీ పదాలు ఒకదాని మీదగా ఇంకొకటి గుర్తించకూడదు. గుర్తించిన క్రింది పదమును (✓) టిక్ పెట్టండి

| | | | | | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| శీ | ఘ్ర | ము | రూ | ఏ | అ | వ | ణ | కు | చు | అ | బే | అ | ను | రో |
| అ | లే | జ | బే | లి | అ | చు | గా | అ | యూ | దా | తే | లే | మ్యో | మ |
| దీ | జే | యా | ను | క | మం | గ | రా | దు | మం | అ | లు | వి | షి | ము |
| వె | త | ల | గ | డ | ల్హా | అ | హే | అ | ది | అ | ప | అ | డ | లు |
| న | దే | అ | వు | బి | అ | యో | లు | వ | ర | ఇ | జం | ము | ల | మూ |
| మై | న | క్షే | డ | కౌ | న | సే | ట | ద్వే | ము | శ్శా | గి | అ | క్ర | భూ |
| ఆ | ఫ్తా | మ | ల | గి | అ | పు | అ | ష | వ | ఖా | సా | ఎ | కొ | సా |
| షే | లి | ము | మ | లి | మ | అ | న | ము | ము | రు | ల | లు | అ | ర |
| రు | ల | కా | ను | క | అ | జీ | త | ము | క్ష్య | అ | వు | అ | త | ము |
| కో | అ | చా | అ | ఖ | రూ | ప | వ | తి | సా | అ | ను | లూ | బూ | జె |
| అ | ప | అ | ర | ఐ | ఆ | మ | ర్యా | ద | అ | మ్రొ | అ | లు | ఎ | ఒ |
| చి | ట | ము | అ | లు | న | వీ | దీ | స్తం | డు | క్కు | ను | ము | జి | అ |
| నా | సం | పూ | ర్తి | జ | తి | ను | నా | భ | కు | బ | మీ | శ | అ | ల్పా |
| రు | ల్లు | ర | అ | అ | దా | లూ | అ | ము | చ | డి | న్యా | వం | ప | అ |
| వి | అ | వ్యా | పిం | చు | ట | అ | జు | అ | వం | అ | బె | అ | థ | గ |

పేరు.............................. గ్రామము..............................

అడ్రస్ లేబుల్ మీద ఉన్న బుక్ సీరియల్ నంబరు..............................

**'బైబిలు పద వినోదము–08'** పూర్తి చేసిన తర్వాత ఈ పేజీని ఫోటో తీసి అడ్రస్ లేబుల్ మీద ఉన్న బుక్ సీరియల్ నంబరు వ్రాసి 9440217726 నంబరుకి వాట్సాప్ ద్వారా పంపగలరు లేదా ఈ పేజీని జెరాక్స్ తీసి **15వ తేదీలోగా** మా అడ్రసుకు పంపగలరు. సీరియల్ నంబరు వేయకుండా పంపిస్తే, వారి పేరు ప్రచురింపబడదు.

| | | | | |
|---|---|---|---|---|
| వంచకుడు | లూజు | నఫ్తాలి | మ్రొక్కుబడి | రూపవతి |
| దీవెన | రాహేలు | జెబూలూను | జీతము | వంశములు |
| వణకుచు | లేయా | ఇశ్శాఖారు | కానుక | వ్యాపించుట |
| భూసారము | రూబేను | యోసేపు | కొలువు | మందిరము |
| మంచు | షిమ్యోను | బెన్యామీను | కోపము | క్షేమము |
| పగ | లేవి | దీనా | సాక్ష్యము | శీఘ్రము |
| మూలము | యూదా | బిల్హా | విల్లు | మర్యాద |
| తలగడ | దాను | జిల్పా | రోమములు | సంపూర్తి |
| స్తంభము | గాదు | చినారు | ఏలిక | ద్వేషము |
| బేతేలు | ఆషేరు | జంగిసాల | కౌగిలి | చారలు |